ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 11 జూన్ 2024

'సోమశిల'కు 3,753 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, జూన్ 10 : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వరద ప్రవాహం పెరుగుతోంది. డ్యాం నీటిమట్టం అడుగంటి బోసిపోగా నైరుతి రుతుపవనాలతో రాయలసీమ జిల్లాల్లో కురుస్తున్న వర్షంతో నాలుగు రోజులుగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం 2,966 క్యూసెక్కులు ఉండగా సోమవారం 3,753 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 7.825 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



అద్భుత ఘట్టం వీక్షణకు

11 ఎల్‌ఈడీ స్క్రీన్‌లు

- సీఎంగా రేపు చంద్రబాబు ప్రమాణస్వీకారం
- జిల్లాలో విస్తృత ఏర్పాట్లు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 10 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం సందర్భంగా జిల్లాలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. విజయవాడ సమీపంలోని గన్నవరం కేసరపల్లి ఐటీ పార్కు వద్ద బుధవారం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనుండగా, ఈ అద్భుత ఘట్టాన్ని జిల్లావాసులూ వీక్షించేలా జిల్లావ్యాప్తంగా 11 ప్రదేశాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ప్రమాణ స్వీకారాన్ని స్వయంగా చూసేందుకు వెళ్లే వారి కోసం జిల్లాలో 32 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి 10 గంటలకు బస్సులు బయలుదేరి 12న ఉదయానికి గుంటూరు చేరుకుంటాయని చెప్పారు. అక్కడ కల్యాణ మండపంలో సేదతీరి, అల్పాహారం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సోమవారం నుంచి 12వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జేసీ సేదు మాధవన్, డీఆర్వో లవన్న, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, రవాణాధికారి శేషయ్య పాల్గొన్నారు.


విద్యుద్దీప వెలుగుల్లో ప్రభుత్వ కార్యాలయాలు

దెబ్బైపోయాం!

- 'ఫోర్జరీ' స్కాంలో తలలు పట్టుకుంటున్న అధికారులు
- ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలు, ఓ లైసెన్సు ఇంజనీరు పాత్ర కీలకం?
- ఓ సహకార సొసైటీ చైర్మన్ ఒత్తిడితో పత్రాలు సిద్ధం
- తీగలాగే కొద్దీ వెలుగు చూస్తున్న వాస్తవాలు

నెల్లూరు (సిటీ), జూన్ 10 : నెల్లూరు నగర పాలక సంస్థలోని ఫోర్జరీ సంతకాల స్కాం కొత్త మలుపు తిరుగుతోంది. ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న మేయర్ భర్త జయవర్ధన్‌తోపాటు సహకార సొసైటీల చైర్మన్ పాత్ర కీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన ఆదేశాలతోనే పత్రం సిద్ధమైనట్లు విమర్శలు గుప్పుమంటుండగా, సచివాలయాల్లోని ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలు ఈ స్కాంను దగ్గరుండి నడిపినట్లు సమాచారం. నెల్లూరు కార్పొరేషన్‌లోని ఫోర్జరీ సంతకాల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నెల్లూరులోని వివిధ ప్రాంతాలలో 70 భవనాల వరకు ఓసీ లేకుండానే మార్టిగేజ్‌లను విడుదల చేశారు. ఇవన్నీ నిర్మాణ దశలో ఉండగానే జరిగినట్లు ప్రధాన ఆరోపణలు వ్యక్తమవుతుండగా, తుదిగా కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి పత్రాన్ని నడిపినట్లు తెలుస్తోంది. న్యాయవాది కాకు మురళి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్వయంగా తన సంతకం కాదని ధ్రువీకరించడం ఈ స్కాంలో గమనార్హం. కాగ నెల్లూరురూరల్లో సహకార సంస్థకు చైర్మన్‌గా ఉన్న ఓ వ్యక్తి తొలుత పత్రాలను సిద్ధం చేయగా అందుకు ఓ మహిళ ప్రజాప్రతినిధి భర్త తుది మెరుగులు దిద్దినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. 12, 24 డివిజన్లలోని సచివాలయాల్లో ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలు ఈ ఇద్దరికి ప్లానింగ్ విభాగంలో కొందరు అధికారులు సహకరించినట్లు సమాచారం. కాగ ఈ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు, సిబ్బంది మాత్రం వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో ముందుకెళ్లడం వల్ల మోసపోయామంటూ తలలు పట్టుకుంటున్నారు.

లోతైన దర్యాప్తు దిశగా

ఫోర్జరీ సంతకాల వ్యవహారంపై మండిపడుతున్న కమిషనర్ వికాస్ మర్మత్ లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. ఇప్పటికే బాధ్యులైన అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేసి లిఖితపూర్వక వివరణ తీసుకుంటున్న ఆయన తదుపరి తన సంతకాలు ఎలా ఫోర్జరీ జరిగాయంటూ విచారణ జరుపుతున్నట్లు సమాచారం. భవనాలకు సంబంధించిన పత్రాలు ఎలా వెళ్లాయి? ఏ ఏ సెక్షన్ల అధికారుల ద్వారా ముందుకు సాగాయంటూ ఆరా తీస్తున్నట్లు సమాచారం.

మెగా డీఎస్సీపై ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తానని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడంతోపాటు ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి. జిల్లాలో డీఎస్సీ అభ్యర్థులు శిక్షణ పొందుతున్న ప్రాంతాల్లో ఎన్ని పోస్టులు ఉంటాయి? ప్రకటన ఎప్పుడు వస్తుంది? పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారంటూ చర్చించుకుంటున్నారు. బుధవారం ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం చేసే తొలి సంతకం మెగా డీఎస్సీ కావడంతో అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు.

- నిరుద్యోగుల నిరీక్షణ
- జిల్లాలో పెరగనున్న టీచర్ పోస్టులు
- జీవో నెం.117 తొలగిస్తారన్న ప్రచారం
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ



ప్రకటన, పరీక్షలపై చర్చలు

నెల్లూరు (విద్య), జూన్ 10 : బీఈడీ, టీటీసీ పూర్తి చేసిన లక్షలాది మంది నిరుద్యోగులు చిన్న ఉద్యోగాలు, పనులు చేసుకుంటూ డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడా అని వేయికళ్లతో ఎదురుచూశారు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ చూడగానే ఆవేదన చెందడంతోపాటు లక్షలాది రూపాయలు వెచ్చించి కోర్సులు పూర్తి చేసిన తమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని కన్నీటి పర్యంతమయ్యారు.

వేలాది మందిలో ఉత్కంఠ

గత ఐదేళ్లలో డీఎడ్ పూర్తి చేసిన వారు 10వేల మంది, బీఈడీ పూర్తి చేసిన మరో 10వేల మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు మార్చి నెలలో వైసీపీ ప్రభుత్వం నామమాత్రంగా డీఎస్సీ ప్రకటన చేయడంతో వేలాది మంది యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర విభజన తరువాత ఇప్పటి వరకు రెండు డీఎస్సీలు నిర్వహించగా వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తక్కువ సమయంలో మూడో డీఎస్సీ విడుదల చేశా రు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం 2014, 2018లో మెగా డీఎస్సీలు ప్రకటించడంతోపాటు పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టారు. కానీ వైసీపీ ప్రభుత్వం మాత్రం నాలుగున్నరేళ్ల తరువాత ఎన్నికల సమయంలో డీఎస్సీని హడావుడిగా ప్రకటించి నిరుద్యోగులను మోసం చేసిందని నిరుద్యోగులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకట న వెలువడుతుండడంతో వేలాదిమంది యువతో ఉత్కంఠ నెలకొంది. తమ జీవితాల్లో వెలుగులు నిండే సమయం ఆసన్నమైందంటూ నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోస్టులు పెరిగే చాన్స్!

జీవో నెం.117 ముసుగులో ఉపాధ్యాయ ఖాళీలను కుదించడంతోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి తగ్గించారు. జిల్లాలో 346 పోస్టులను భర్తీ చేయాలని ఇందులో కూడా ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, టీజీటీ పోస్టులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. జిల్లాలో వేలమంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఐదేళ్ల నుంచి ఎదురుచూస్తుండగా కొన్ని పోస్టులు మాత్రమే భర్తీ చేయడంపై వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. జడ్పీ, ప్రభుత్వ, మునిసిపల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీలు ఉన్నా కూడా భర్తీ చేయకుండా గడిచిన ప్రభుత్వంలో పోస్టులను దాచేయడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత, ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌జీటీల కొరత ఉండడంతో విద్యార్థుల చేరిక కూడా తగ్గిపోయినట్లు గణాంకాలు చెపుతున్నాయి. అలాగే పలు ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగుతుండగా ఈ పాఠశాలల్లో బోధన నామమాత్రంగానే ఉంటుంది. మరికొన్ని చోట్ల సీఆర్పీలు ఉపాధ్యాయులుగా కొనసాగుతుండగా ఆయా ప్రాంతాల్లో మాత్రం పోస్టులను భర్తీ చేసే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఈ నేపథ్యంలో నూతనంగా ఏర్పడే ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంపై యువత, నిరుద్యోగులు కోటి ఆశలతో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీఓను తొలగించి, పాఠశాలలకు పూర్వవైభవం తీసుకువస్తారని, ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేస్తారన్న ప్రచారంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.


కోటంరెడ్డికి కేక్ తినిపిస్తున్న అజీజ్

సంబరం!

సినీనటుడు నందమూరి బాలకృష్ణ జన్మదినాన్ని జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం అట్టహాసంగా జరుపుకున్నారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నెల్లూరు రూరల్, గూడూరు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పాశిం సునీల్, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన బాలయ్య వీడియో ఆకట్టుకుంది.


మంటల్లో తగలబడుతున్న టపాసుల గోదాము

టపాసుల గోదాములో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ !

ఒకరికి తీవ్రం, ఇద్దరికి స్వల్ప గాయాలు

బిట్రగుంట, జూన్ 10 : బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప జాతీయ రహదారి సమీపంలోని టపాసుల గోదాములో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. టపాసుల మోతతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు... బోగోలుకు చెందిన మాదినేని సుమంత్ కొంతకాలంగా టపాసుల గోదాము నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి సరుకు రావడంతో గోదాములోపల సుమంత్, తిప్పకు చెందిన పీట్ల సురేష్ రేనా సర్దుతున్నారు. అయితే, గోదాములో విద్యుత్ తీగలు షార్ట్‌సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు కింద పడి ఒక్కసారిగా మంటలు రేగడంతో సుమంత్, ఈయన తండ్రి నాగేశ్వరావు బయటకు పరుగులు తీశారు. వీరి వెనుకే పరుగు తీస్తున్న సురేష్ దుస్తులకు మంటలు అంటుకోవడంతో శరీరం చాలా వరకు కాలింది. పెద్ద మంటలు, టపాసుల మోతలు చూసిన స్థానికులు పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. తిప్ప ఎస్‌ఐ బోజ్యా, కావలి రూరల్ సీఐ నాగభూషనం వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కావలి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేశారు. టపాసుల పేలుడు కారణంగా గోదాము గోడలు విరిగి పైస్లాబు కూలింది. అర్ధగంట వ్యవధిలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. జిల్లా అగ్నిమాపక అధికారి వాకా శ్రీనివాసులురెడ్డి, కావలి ఇంచార్జి సుధాకర్, తహసీల్దారు వెంకటరత్నం, వీఆర్వో సతీష్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడు సురేష్‌ను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

ఈ కష్టాలు ఇంకెన్నాళ్లు!?

చినుకు రాలితే చాలు నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డు చెరువును తలపిస్తోంది. వేదాయపాళెం సెంటర్ సమీపంలోని మున్సిపల్ స్కూలు వరకు సిమెంటు రోడ్డు వేసిన గత పాలకులు పాత రోడ్డు కనెక్టవిటీని మరిచారు. దీంతో సిమెంటు రోడ్డు ఎత్తుగా ఉండటం వల్ల వర్షం కురిస్తే ఈ ప్రాంతం చెరువును తలపిస్తోంది. అలాగే, కరెంటాఫీస్ సెంటర్ వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకింది. ప్రస్తుతం ఈ రెండుచోట్ల రోడ్డుపై గుంతలు ఏర్పడి, అందులో వర్షపునీరు నిలిచింది. ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు


నడిరోడ్డుపై ఎంతపెద్ద గుంతతో...!


చెరువు కాదండోయ్.. పటేల్ విగ్రహం వద్ద..


అడుగుతప్పితే అంతే.. వేదాయపాళెం సెంటర్ వద్ద రోడ్డు దుస్థితి

వీఎస్‌యూలో ఫైళ్లు మాయం..?

వెంకటాచలం, జూన్ 10: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పలు ఫైళ్లు బయటకు వెళ్తున్నాయని సోమ వారం పుకార్లు షికారు చేశాయి. గత వైసీపీ ప్రభుత్వం లో యూనివర్సిటీ ఉన్నతాధికారులు వారి హయాంలో జరిగిన పనులకు సంబంధించిన పలు ఫైళ్లను మాయం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో యూనివర్సిటీ లో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులు, కార్యకలాపా లన్నింటిపై క్షేత్రస్థాయిలో ఒక ప్రత్యేక కమిటీని వేసి విచా రణ జరిపించాలని, ఒకవేళ అక్రమాలు జరిగినట్లు నిర్ధార ణ అయితే సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్య లు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సిమెంట్ ట్యాంకర్ బోల్తా

- ప్రమాదంలో గేదె మృతి.. మరో గేదెకు గాయాలు
- తప్పిన ఘోర ప్రమాదం





బోల్తా పడిన ట్యాంకర్, మృతి చెందిన, గాయపడ్డ గేదెలు

సంగం, జూన్ 10: సంగం కొండ వెనుక ఆత్మకూరు వైపు వెళ్లే మార్గంలో ముంబాయి-జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం వేగంగా వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. వివరాల మేరకు.. కృష్ణపట్నంలో సిమెంట్ అన్‌లోడ్ చేసి తిరిగి కడప వైపు వెళ్తున్న ట్యాంకర్ సంగం కూడలి దాటిన తరువాత ముంబాయి జాతీయ రహదారిపై కొండ ఎక్కి దిగే చోట గేదెలు రహదారికి అడ్డుగా వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో అదుపుతప్పి కారును ఢీకొట్టి ట్యాంకర్ రోడ్డు పక్కన ముళ్ల పొదల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒక గేదె మృతి చెందగా, మరొక గేదెకి తీవ్రగాయాలైనాయి. కారు వెనుక భాగం దెబ్బతినింది. కారులోని వారికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. డ్రైవర్ చాకచక్యంతో ట్యాంకర్‌ను ముళ్ల పొదల్లోకి మళ్లించడంతో కారులోని వారికి ప్రమాదం తప్పింది. లేకపోతే ఘోర ప్రమాదం చోటు చేసుకునేది. ఈ సంఘటనలో ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 10: వేదాయపాలెం-నెల్లూరు రైల్వే స్టేషన్‌ల మధ్య ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు సోమవారం సం ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృ తుడు వయస్సు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుంది. ఎడ మ వైపు ఛాతీపై ప్రభాస్ అని తెలుగు అక్షరాలు ఉన్నాయి. ఎర్రని టీ షర్ట్, తెలుపు, నీలం రంగు గీతలు కలిగిన లుంగీ ధరించి ఉన్నాడు. రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన మృతదేహా న్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని ఆవులు..

మర్రిపాడు, జూన్ 10: నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై సోమవారం చుంచులూరు వద్ద ఆర్టీసీ బస్సు ఆవుల మందను ఢీకొంది. ఈ ప్రమాదంలో 5ఆవులు మృతి చెందాయి. జమ్మలమడుగు డిపోకు చెందిన బస్సు నెల్లూరు వెళ్తుండగా, రోడ్డు దాటేందుకు ఆవుల మంద ఒక్కసారిగా రోడ్డుపైకి రావటంతో ఈ ఘటన జరిగింది.



బస్సు ఢీకొని దుప్పి..

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 10: కట్టకిందపల్లి సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొని చుక్కల దుప్పి మృతి చెందింది. వివరాల మేరకు.. పామూరు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు గ్రామ సమీపానికి రాగానే అకస్మాత్తుగా రోడ్డుపైకి చుక్కల దుప్పి రావడంతో ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న డీఆర్వో ప్రసాద్ తన సిబ్బందితో అక్కడికి వచ్చి మృతిచెందిన దుప్పిని స్వాధీనం చేసుకొని శవపంచనామా నిర్వహించారు. అనంతరం సమీప అటవీ ప్రాంతంలో దుప్పిని దహనం చేశారు.

ఇనమడుగు సబ్‌స్టేషన్‌లో నల్లత్రాచు



కోవూరు, జూన్ 10: మండల పరిధి లోని ఇనమడుగు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం ఓ నల్లత్రాచు హల్‌చల్ చేసింది. గత కొద్దికాలంగా ఆ పాము సబ్‌స్టేషన్‌లోనే సంచరిస్తున్నట్లు తెలిసిం ది. కాగా, నల్లత్రాచు సబ్‌స్టేషన్‌లో తిరుగు తుండడంతో సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు.

తెల్లరాయి తరలిస్తున్న లారీల సీజ్

సైదాపురం, జూన్ 10 : అక్రమంగా తెల్లరాయి తరలిస్తున్న మైనింగ్ లారీలపై సోమవారం రాత్రి అధికారులు దాడులు నిర్వహించారు. లింగసముద్రం గ్రామంలో ఓ యార్డ్ నుంచి తెల్లరాయి తరలిస్తున్న లారీని జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బాలాజీ నాయక్ సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కాగా, తుమ్మలతలుపూరులో జయలక్ష్మి మైనింగ్ నుంచి తెల్లరాయి అక్రమంగా తరలిస్తున్న ఓ లారీ గోవును తొక్కుకుని వెళ్ళిపోవడంతో గోవు అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించు కోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలు

కోవూరు, జూన్ 10: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలైన సంఘటన జాతీయ రహదారిపై రామన్నపాళెం గేటు సమీపంలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సంగం మండల పరిధిలోని దువ్వూరు గ్రామానికి చెందిన విద్యార్థులు పండు, కిట్టూ, ప్రణయ్ నెల్లూరు నగరంలోని వీఆర్ కళాశాలకు వెళ్ళి తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా లారీ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలకు గురైన వారిని 108 వాహనంలో నెల్లూరు నగరంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద స్థలిలో క్షతగాత్రులైన విద్యార్థులు

చెముడుగుంటలో ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం : చెముడుగుంట పంచాయతీ పరిధిలోని గణపతి ప్లాజా అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు. చెన్నైకి చెందిన రామ్మూర్తి సురేష్‌కుమార్ (38) తన కుటుంబంతో కలిసి బుజబుజనెల్లూరు సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో కాపురం ఉంటున్నాడు. అయితే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో తన ప్లాట్‌లోని బెడ్రూంలో దుప్పటితో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం సాయంత్రం గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్‌శాఖ ఉద్యోగి దుర్మరణం



కలువాయి, జూన్ 10 : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సబ్‌ఇంజనీర్‌గా పనిచేస్తున్న యశ్వంత్ (25) బెంగుళూరు శివార్లలో 3 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం అతను వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మరణించాడు. విద్యుత్‌శాఖ ఉద్యోగుల సమాచారం మేరకు... మూడు రోజుల క్రితం ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం బెంగుళూరుకు వెళ్లాడు. అక్కడ మోటారు సైకిల్‌పై వెళ్తతూ ప్రమాదానికి గురయ్యాడు. తోటి ఉద్యోగి దుర్మరణం చెందడంతో కలువాయి విద్యుత్‌శాఖ ఉద్యోగులు విషాదంలో మునిగిపోయారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	156
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	304
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6845
వెండి కిలో ధర	రూ. 91,000
వెండి ఒక గ్రాము	రూ. 93.00

హై ఓల్టేజీతో గృహోపకరణాల దగ్ధం

అల్లూరు, జూన్ 10: స్థానిక వాటర్ ట్యాంక్ సెంటరు ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో హై ఓల్టేజీ ఏర్పడడంతో గృహోపకరణాలు, దుకాణాల్లోని ఫ్యాన్లు, ఫ్రిడ్జ్‌లు, కంప్యూటర్లు, ప్రింటర్లు కాలిపోయాయి. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా స్తంభాల్లో నుంచి మంటలు చెలరేగడంతో స్థా నికులు భయాందోళనలకు గురయ్యారు. నాణ్యతాలోపంగా విద్యుత్ సరఫరా వస్తున్న విషయాన్ని పలుమార్లు విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పో యిందని వారి నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని స్థానికు లు మండిపడ్డారు.

రీసర్వే రద్దయ్యేనా ?

- ప్రైమ్ 2.0తో రైతులకు సమస్యలు
- ఎల్‌పీఎం నెంబరుతో ఇరకాటం
- పాసుపుస్తకాలపై జగన్ ఫొటో తొలగేనా ?

రైతులకు సమస్యాత్మకంగా మారిన భూముల రీసర్వే కొత్త ప్రభుత్వంలో కొనసాగేనా.. రద్దు అయ్యేనా...? ప్రతి అన్నదాత మదిలో మెదులుతున్న ప్రశ్న ఇది. భూములు మావి... పాసుపుస్తకాల్లో జగన్ ఫొటో ఏంటని రైతులు మొదటి నుంచి అధికారులను నిలదీస్తున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే అన్ని విధాలా సమస్యాత్మకంగా మారి, రిజిస్ట్రేషన్ ప్రక్రియకు తీవ్ర ఆటంకంగా మారింది. ప్రైమ్ 2.0 పేరుతో కొత్త సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చి రిజిస్ట్రేషన్‌లో మార్పులు తీసుకువచ్చింది. దీని ద్వారా తలెత్తుతున్న సమస్యలు తీరుతాయా.. లేక కొనసాగుతాయా.. అనే ఆలోచనలో రైతులు ఉన్నారు. తాము అనుకున్న విస్తీర్ణాన్ని మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉండగా, కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ ద్వారా రైతుకున్న పూర్తి విస్తీర్ణాన్ని రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తుంది. ఈ పద్ధతి ద్వారా ఎన్నో సమస్యలు ఉత్పన్నమై ఉన్నతాధికారులు సైతం తల లు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది.



అల్లూరు, జూన్ 10 : భూముల రీసర్వే చేపట్టిన రైతుకు రెవెన్యూ శాఖ ఇచ్చే 1బీ నమూనా, అడంగల్ పహణీల్లో ఎల్‌పీఎం(ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నెంబరు అంటూ కొత్తగా ఓ కాలమ్ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ శాఖలో తీసుకొచ్చిన కార్డు ప్రైమ్ 2.0 పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేయాలంటే సదరు ఎల్‌పీఎం నెంబరుకు అనుబంధంగా ఉండే సర్వేనెంబరులోని మొత్తం విస్తీర్ణాన్ని రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. ఇది ఓ అధికారో... కంప్యూటర్ ఆపరేటర్లో చేసే పని కాదు. నేరుగా ఎల్‌పీఎం నెంబరును ఎంచుకుంటేచాలు సదరు రైతుకు చెందిన భూమి మొత్తం బదిలీ అయిపోతుంది. ఈ సమస్యతో ఓ రైతుకు చెందిన ఎకరం భూమిలో అరెకరం భూమిని విక్రయించాలంటే జరిగే పని కాదు. పూర్తిగా బదిలీ చేసేయాల్సిందే.

● సర్వేనెంబర్ల నిర్వీర్యం

భూముల భౌతిక స్థితి ఎలా ఉంది. ఎవరి ఆధీనంలో ఉందనే విషయాలను సర్వే నెంబర్ల ద్వారా గుర్తించే అవకాశం ఉంది. కానీ రీసర్వే ద్వారా ప్రతీ రైతుకు ఎల్‌పీఎం నెంబరును కేటాయించి ఆ రైతుకు చెందిన ఒక గ్రామంలోని భూముల సర్వేనెంబర్లు ఆ ఎల్‌పీఎం నెంబరుకు అనుబంధం చేస్తారు. తద్వారా ఎల్‌పీఎం నెంబరును ఎంపిక చేసే ఆ రైతు భూమి సర్వేనెంబర్లు మొత్తం పేర్కొంటారు.ఇలా సర్వేనెంబర్లను నిర్వీర్యం చేయడం ఒక సమస్య అయితే, రైతుకు చెందిన ఒకే సర్వేనెంబరుకు రెండు మూడు ఎల్‌పీఎం నెంబర్లు కేటాయించడం మరో సమస్యగా మారింది. దీని ద్వారా రైతు భూమిని విక్రయించాలన్నా బదిలీ చేయాలన్నా ఒక ఎల్‌పీఎం నెంబరులోని భూమిని పూర్తిగా బదిలీ చేయాల్సి ఉంది.

రీసర్వే నిలిపేస్తే మంచిది



రీసర్వే ద్వారా మా భూములకు శాశ్వత హక్కులు ఏర్పడతాయనుకున్నాం. కానీ రిజిస్ట్రేషన్‌లో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రుణాలు పొందాలన్నా పొందలేకున్నాం. ఈ కారణంగా రైతులకు ఉపయోగపడని రీసర్వే ను నిలుపుదల చేస్తేనే మంచిది.

- తోట శ్రీహరి, రైతు, గ్రద్దగుంట, అల్లూరు మండలం

ఆ పాసు పుస్తకం రద్దు చేయాలి



రీసర్వే ద్వారా మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకంపై మాజీ సీఎం జగన్ ఫొటో ఉండడంతో బ్యాంకులకు వెళ్తే వాటిని అనుమతించడం లేదు. రుణాల మంజూరుకు కూడా తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఈ పట్టాదారు పాసుపుస్తకాలు రద్దు చేసి మళ్లీ కొత్తవి ఇవ్వాలి.

- గంగపట్నం శీనయ్య, రైతు, ఇస్కపల్లి, అల్లూరు మండలం

పనిచేసే చోటే నివాసం ఉండాలి

జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య

నెల్లూరు(హరనాథపురం), జూన్ 10 : బీసీ వసతి గృహాల సంక్షేమాధికారులు, నాల్గవ తరగతి సిబ్బంది పనిచేసే గ్రామాల్లోనే నివాసం ఉండాలని బీసీ జిల్లా సంక్షేమ సాధికారత అధికారి వై. వెంకటయ్య ఆదేశించారు. సోమవారం నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో బీసీ వసతి గృహాల సంక్షేమాధికారులు, సహాయ బీసీ సంక్షేమాధికారులతో చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాలు, అందులోని వసతులు, అక్కడే సంక్షేమాధికారుల నివాసం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జాబ్ చార్ట్ ప్రకారం విధులకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. రెన్యూవల్ విద్యార్థులను ఈనెల 30వ తేదీ లోపు చేర్చుకొని సంబంధిత సమాచారాన్ని జిల్లా కార్యాలయానికి తెలియచేయాలన్నారు. నూతనంగా ప్రవేశం కోసం వచ్చిన దఖాస్తులను హాస్టల్ అడ్వైజరీ కమిటీతో ఆమోదింపచేసుకొని జూలై 31లోగా జాబితా జిల్లా బీసీ సంక్షేమాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈనెల 1న కళాశాల వసతి గృహాలను ప్రారంభించామని, 13న ప్రీ మెట్రిక్ వసతి గృహాలు ప్రారంభించాలన్నారు. వసతి గృహాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల ప్రారంభం నుంచే స్టడీ క్లాసులు నిర్వహించాలని ఆదేశించారు. మెరుగైన ఫలితాలు సాధించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పనమాల శ్రీహరిరావు మాట్లాడుతూ బీసీ బాలికల వసతి గృహం మరుగుదొడ్లకు కనీసం తలుపులు కూడా లేవని, వాటిని ఏర్పాటు చేయించడంతో పాటు కనీస వసతులు ఏర్పాటు చేయాలన్నారు.



షేక్ సాదియాకు నగదు అందచేస్తున్న వెంకటయ్య, శ్రీహరి తదితరులు

10వ తరగతి విద్యార్థికి నగదు అందజేత

ఆత్మకూరు బీసీ బాలికల వసతి గృహంలో చదివి టెన్త్‌లో అత్యధికంగా 586 మార్కులు సాధించిన షేక్ హలీమ సాదియాకు బీసీ కార్యాలయం పర్యవేక్షకుడు మంద శ్యాంసన్ రూ.5వేలు, డేటా ఎంట్రీ ఆపరేటర్ సుజన రూ.500 అందచేశారు. ఈ సమావేశంలో సహాయ బీసీ సంక్షేమాధికారులు కె.ప్రసూన, శ్రీదేవి, తేజోవతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యావిధానంలో మాతృభాషకు ప్రాధాన్యం

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి



జాతీయ సదస్సులో ఉపన్యసిస్తున్న మాడభూషి సంపత్‌కుమార్

వెంకటాచలం, జూన్ 10 : భారతీయ నూతన విద్యావిధానంలో మాతృ భాషలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని, తద్వారా మాతృభాషలను అభివృద్ధి చేసుకోవాలని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్ ఆకాంక్షించారు. భారతీయ ప్రాచీన భాషల సాహిత్యం సమృద్ధ మని, మన సంస్కృతికి దర్పణమని ఆయన అన్నారు. కర్ణాటక రాష్ట్రం మైసూరు లో గల భారతీయ భాషల సంస్థలో సోమవారం భారతీయ భాషల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఇందులో ఆయన మాట్లాడుతూ ప్రాచీన భాషలైన తె లుగు, కన్నడ, మలయాళం, ఒడియా మొదలైనవి గొప్ప సాహిత్యాన్ని ఇముడ్చు కున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ భాషల పరిశోధకులు, అధ్యాపకులు, ఔత్సాహికులు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఇళ్ల కూల్చివేత

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 10: ఏరుకొల్లు ఎస్సీ కాలనీ సమీపంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లలోని ఇళ్ల నిర్మాణాలను సోమవారం అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఎక్స్‌కవేటర్ సహాయంతో కూల్చివేశాడు. అది తన స్థలమని, గత ప్రభుత్వం దౌర్జన్యంగా ఆక్రమించుకుని జగనన్న లేఅవుట్ వేసి ఇళ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టిందన్నారు. అందుకే ఇళ్ల నిర్మాణాలను కూల్చివేస్తున్నట్లు తెలిపారు. స్థానికులు విషయాన్ని రెవెన్యూ, పోలీసులు అధికారులకు తెలిపారు. దీంతో వారు గ్రామానికి చేరుకొని ఇళ్లను కూల్చివేయిస్తున్న వ్యక్తితోపాటు యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి సీఐ గిరిబాబు, ఎస్ఐ ఉమాశంకర్ కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

వైసీపీలో ఉండి తప్పుచేశాం!

రాజీనామా చేస్తున్నాం.. శ్రీధర్‌రెడ్డిని మరచిపోలేం..

నెల్లూరు నగర మేయర్ స్రవంతి దంపతులు

నెల్లూరు (సిటీ) : 'శ్రీధరన్న... మమ్మల్ని క్షమించు. సరిదిద్దుకోలేని తప్పు చేశాము. వైసీపీ పెద్దల ఒత్తిళ్ల తట్టుకోలేకే ఆ పార్టీలో ఉండాల్సి వచ్చింది.' అంటూ నగర మేయర్ పోట్లూరి స్రవంతి అన్నారు. సోమవారం తన భర్త జయవర్ధన్‌తో కలిసి కార్పొరేషన్‌లోని తన చాంబర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. తాము ఇద్దరం వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. నెల్లూరురూరల్ వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన ఆదాల పెద్ద మనిషి అనుకుని అక్కడు వెళ్తే కనీస గౌరవం కూడా ఇవ్వలేదని వాపోయారు. తాము చేసింది తప్పని తెలిసిన ఏం చేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోయామని పేర్కొన్నారు. ఆదాల దగ్గరుండే ఓ బృందం తమను నిత్యం వేధిస్తూ టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డిపై అసత్య ప్రకటనలు చేయాలని, మీడియా సమావేశం పెట్టాలని ఒత్తిడి తీసుకువచ్చే వారన్నారు. తమను మేయర్‌ను చేసిన శ్రీధర్‌రెడ్డిని ఎప్పటికీ మరిచిపోలేమని, అవకాశమిస్తే తిరిగి ఆయన చెంతకు చేరుతామని విజ్ఞప్తి చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ దంపతులు

● ఏ విచారణకైనా సిద్ధం

తనపై వస్తున్న ఫోర్జరీ ఆరోపణలకు ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నట్లు మేయర్ భర్త జయవర్ధన్ తెలిపారు. ఫోర్జరీ సంతకాల అంశంలో తమ పాత్ర లేదని, తనపై చేసిన ఫిర్యాదులోనూ వాస్తవం లేదని, అధికారులు విచారించి దోషులను శిక్షించాలని కోరారు. ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు తన వంతు ఆదేశాలు ఇస్తామని మేయర్ పేర్కొన్నారు.

కొమ్మిలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కొండాపురం, జూన్ 10: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతోపాటు మండల మాజీ జెడ్పీటీసీ దామా మహేశ్వరరావు జన్మదిన వేడుకల సందర్భంగా సోమవారం కొమ్మి గ్రామంలో రాష్ట్రస్థాయి ఎద్దుల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పందేంలో రెండు పళ్ల ఎద్దుల విభాగంలో 7జతల ఎద్దులు పాల్గొన్నాయి. పకాశం జిల్లా బేస్తవారిపేల మండలం ఖాజీపురం గ్రామ రైతు వీ.ఓసరారెడ్డి ఎద్దులు నిర్ణీత సమయంలో అధిక దూరంలాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.25 వేలు, గిద్దలూరు మండలం అక్కిరెడ్డిపల్లెకు చెందిన రైతు కె.దక్షిత్‌రెడ్డి ఎద్దులు రెండో బహుమతిగా రూ.20 వేలు, బాపట్ల మండలం కుక్కులవారిపాలెం గ్రామ రైతు జ్ఞానేశ్వరరెడ్డి ఎద్దులు తృతీయ బహుమతిగా రూ.15 వేలు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఎద్దులు నాల్గవస్థానంలో నిలిచి రూ.12 వేలు గెలుచుకున్నాయి. అలాగే సీనియర్ విభాగంలో పోటీలో గెలిచిన ఎద్దుల జతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.7వేలు, మూడో బహుమతిగా రూ.5వేలు అందచేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి జత ఎద్దులకు కన్సోలేషన్‌గా రూ.2 వేల నగదును దామా మహేశ్వరరావు అందజేశారు. అంతకుముందు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దామా మహేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు సందర్భంగా కేకును కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొట్లగుంట హరిబాబు, టీ.లక్ష్మీనారాయణ, గద్దె రాఘయ్య, పోలినేని చంద్రబాబునాయుడు, దాసరి అశోక్, మామిళ్లపల్లి వెంకటరమణయ్య, చెరుకూరు సురేష్, అంబటి సురేంద్ర పాల్గొన్నారు.



ఎద్దుల బలప్రదర్శనను ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ మహేశ్వరరావు



జూన్‌లో వికసించిన మే పుష్పం

అనంత సాగ రం, జూన్ 10: సోమశిలలోని కొప్పాల లక్ష్మీదేవి ఇంటి ఆవరణలో మే పుష్పం వికసించింది. సహ జంగా మే మా సంలో పువ్వు వికసించాల్సి ఉండగా ఈసారి పది రో జులు ఆలస్యంగా వికసించడంతో స్థా నికులు ఆసక్తిగా తిలకించారు.

సహకార సంఘాల్లో బకాయిలు వసూలు చేయండి

● జిల్లా సహకారశాఖాధికారి గురప్ప

నెల్లూరు(హరనాథపురం), జూన్ 10 : సహకార సంఘాల్లో బకాయిలు వసూలు చేయాలని జిల్లా సహకార శాఖాధికారి బి.గురప్ప అన్నారు. సోమవారం డీసీవో కార్యాలయం నుంచి సహకార సంఘాల సిబ్బందికి ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీసీవో గురప్ప మాట్లాడుతూ సహకార సంఘాలు డీసీసీ బ్యాంకులో బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం 1964 సెక్షన్ 71, 61 ప్రకారం సహకార అధికారులు కోర్టులో దావా దాఖలు చేయాలన్నారు. భారతీయ కాలదోషాల చట్టం, సివిల్ ప్రొసీజరు కోడ్‌లోని అంశాలు, బకాయిదారులపై ఫైలు చేయబడిన అమలు దరఖాస్తులు తదితరాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి కె.తిరపతయ్య, కావలి డివిజనల్ సహకార అధికారి యల్లమందరావు, ప్రొద్దుటూరులోని సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు రూ.330

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం 703 పొగాకు బేళ్లు అమ్మకానికి వచ్చాయి. 16 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 545 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-94, ఆర్ఆర్-1, సీఆర్-15, జంపిం గ్‌లాట్స్-48 కారణాలతో 158 బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.330, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.287.26గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు



ఆత్మకూరు వీవర్స్‌కాలనీలో రోడ్డు దుస్థితి

ఆత్మకూరు, జూన్ 10: మున్సిపాలిటీ పరిధిలోని జెఆర్‌పేట, ఎల్‌ఆర్‌పల్లి, వీవర్స్‌కాలనీ, బీసీ కాలనీ, పేరారెడ్డిపల్లి, వెంకట్రావుపల్లిలోని అంతర్గతరోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చినుకు పడితే చిత్తడిగా మారుతుండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొన్ని ప్రాంతాల్లో కొంత మేరకు సీసీ రోడ్లు నిర్మించినా పూర్తిగా సమస్యల పరిష్కారం కాలేదు. 23వార్డుల్లో 120కిలోమీటర్ల మేర అంతర్గత రోడ్లు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వంలో రూ.25కోట్లతో పూర్తి స్థాయిలో రోడ్లు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే అవి టెండర్ దశలో ప్రభుత్వం మార డంతో ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. దానికితోడు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో మురుగు కాలువల్లోని నీరు రోడ్లుపై పారుతోంది. పాలకులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాబు ప్రమాణస్వీకారానికి బస్సు

ఉదయగిరి రూరల్, జూన్ 10: ఈ నెల 12న విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవానికి హాజరయ్యేందుకు సీతారామపురం, ఉదయగిరి మండలాలకు బస్సు ఏర్పాటు చేసినట్లు పార్టీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 6గంటలకు సీతారామపురం, 7 గంటలకు ఉదయగిరి టీడీపీ కార్యాలయాల నుంచి బస్సు బయలుదేరు తుందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సొసైటీ ఛైర్మన్ రాజీనామా



సీఈఓకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న రామాంజనేయులు

వరికుంటపాడు, జూన్ 10: స్థానిక సొసైటీ కార్యాలయ ఛైర్మన్ గుంటుపల్లి రామాంజనేయులు సోమవారం పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించిన ఆయన రాజీ నామాపత్రాన్ని సీఈవో రత్తయ్యకు అందజేశారు. నామినేటెడ్ పదవి కావడంతో ఇటీవల రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ రాజీనామా సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

సచివాలయంలో చంద్రబాబు ఫొటో



రామాపురం సచివాలయంలో ఫొటోను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

వరికుంటపాడు, జూన్ 10: రామాపురం సచివాలయంలో సోమవారం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటుకుంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫొటోను ఆవిష్కరించారు. అలాగే సచివాలయంతో పాటు రైతుభరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల్లోనూ గత ప్రభుత్వానికి సంబంధించిన నవరత్నాల శిలాఫలకాలను సైతం తొలగించారు.

సంగంలో ఫ్లాగ్‌మార్చ్



సంగం, జూన్ 10: సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిపిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలకేంద్రంలోని పారామిలిటరీ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

నారా భువనేశ్వరితో కాకర్ల కుటుంబం



భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాకర్ల కుటుంబ సభ్యులు

ఉదయగిరి రూరల్, జూన్ 10: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరిని సోమవారం ఉండవల్లిలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన కుటుంబసభ్యులతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఘన విజయం సాధించడం పట్ల ఆమె కాకర్లను అభినందించారు. ఉదయగిరి అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని భువనేశ్వరి కాకర్లకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట కాకర్ల సతీమణి ప్రవీణ, తమ్ముడు కాకర్ల సునీల్, మరదలు సురేఖ, కుమార్తె ధాత్రి ఉన్నారు.

ఆనంను కలిసిన దర్గా పీఠాధిపతులు



ఆనంను సత్కరిస్తున్న దర్గా నిర్వాహకులు

అనంతసాగరం, జూన్ 10: ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డిని సోమవారం అనంతసాగరం మహ్మూర్ అలీషా ఖాదరీ దర్గా నిర్వాహకులు సయ్యద్ షానీసాహెబ్, మజీద్ సాహెబ్, మీరాన్‌లు నెల్లూరులో ఆయన నివాసంలో కలిసి అభినందించారు. శాలువాలతో సత్కరించిచారు. అనంతసాగరం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఖాసీం బాష, రహీంసాహెబ్, ఫకృద్దీన్ పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతం అభివృద్ధికి సమష్టిగా కృషి

● కావలి ఎమ్మెల్యే దగుమాటి



టీడీపీ నాయకులతో కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి

ఉదయగిరి రూరల్, జూన్ 10: మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాసనసభ్యులు కాకర్ల సురేష్‌తో కలిసి చర్యలు చేపడతామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ శుభ కార్యానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆయన తొలుత టీడీపీ కార్యాలయం వద్ద నాయకులతో కలిసి ముచ్చటించి మాట్లాడారు. వెలిగొండలో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తిచేసి ఈ ప్రాంతంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఉదయగిరికి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు తీసుకొచ్చి పట్టణ ప్రజల తాగునీటి కష్టాలను శాశ్వతంగా దూరం చేస్తామన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి కాకర్ల సురేష్ ప్రణాళికతో ఉన్నారని, అందుకు తాము కూడా చేయూతనందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, పమిడి రవికుమార్‌చౌదరి, రంగారెడ్డి, శ్రీకుర్తి రవీంద్ర, గడ్డం శ్రీనివాసులు, మతకాల శ్రీనివాసులు, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పరాజయానికి సజ్జలే కారణం

● సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి



ఉదయగిరి రూరల్, జూన్ 10: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయానికి కారణం సజ్జల రామకృష్ణారెడ్డే అని ఉదయగిరి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్పంచుల హక్కులను కాలరాసి అన్నివిధాలుగా వారు నష్టపోయేలా చర్యలు తీసుకున్నట్లు ఆరోపించారు. పంచాయతీల నిధులను సైతం పక్కదారి పట్టించేలా సలహాలిచ్చి పార్టీ ఘోర పరాభావానికి సజ్జల ముఖ్యపాత్ర పోషించారన్నారు. సర్పంచులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు సజ్జల చేసిన దుర్మార్గపు పనులతో రాష్ట్రంలో వైసీపీకి ఈ దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలను నిర్వీర్యం చేసి తన సొంత ప్రయోజనాలకు వాడుకుని అక్రమంగా ప్రభుత్వం సొమ్మును దోచుకున్న వ్యక్తి సజ్జల అన్నారు. ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని దోచుకొన్న కోట్ల రూపాయలను నష్టపోయిన సర్పంచులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు సజ్జల పంచిపెట్టాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదినం



ఉదయగిరిలో కేక్ కట్ చేస్తున్ననాయకులు



చేజర్ల: కేక్ కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఉదయగిరి రూరల్, జూన్ 10: స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు సోమవారం సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సీహెచ్ బయ్యన్న, రియాజ్, బొజ్జా నరసిం హులు, నల్లిపోగు రాజా, గడ్డం శ్రీనివాసులు, నరసింహ, సయ్యద్ నవాజ్, ఖాన్‌సా, మాబాషా, ఉప్పుటూరి వెంక టయ్య, మట్ల రామయ్య, శివకృష్ణ పాల్గొన్నారు.

చేజర్ల: ఆదురుపల్లిలో టీడీపీ సీనియర్ నాయకలు చీర్ల వెంకటేశ్వర్లు బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి స్థానికులకు పంచారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలకు స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో చీర్ల వెంకటయ్య, వీర్ల వెంకటయ్య, సీనయ్య, పటాన్ షాన్‌వాజ్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ

అనంతసాగరం, జూన్ 10: మండలంలోని శాంతినికేతన్, వికాస్, లిటిల్‌ఏంజెల్స్, సూర్య ప్రైవేటు పాఠశాలలను సోమవారం ఆత్మకూరు డిప్యూటీ డీఈవో గోపాల్ తనిఖీ చేశారు. పక్కాగా అనుమతులు ఉండాలని, అర్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందించాలని ఆదేశించారు. సరైన వసతులు సమకూర్చాలని, అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయరాదని సూచించారు. రికార్డులపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంఈవో-1 జానకీరాం ఉన్నారు.

సీతారామపురం: ప్రైవేటు పాఠశాలలకు అన్ని అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎంఈఓ ఎస్‌కె మస్తాన్‌వలి తెలిపారు. సోమవారం అన్ని ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వసతులు సక్రమంగా ఉండాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ మండల వారీగా బృందాలను ఏర్పాటు చేసిందన్నారు.

రామోజీరావు మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న నేతలు

ఆత్మకూరు, జూన్ 10: స్థానిక పాత గవర్నమెంట్ హాస్పటల్ ప్రాంగణంలో సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆత్మకూరు బ్రాంచ్ ఛైర్మన్ మహ్మద్ సాదిక్‌హుసేన్ ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతికి సంతాపసభను ఏర్పాటు చేశారు. పార్టీల నేతలు, పురప్రముఖులు, జర్నలిస్టులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడు ముల సుధాకర్‌రెడ్డి, సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

సంగం, జూన్ 10: విద్యుదాఘాతంతో మరణించిన సంగం వినోద్, గుండెపోటుతో మృతి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి, అనారోగ్యంతో మరణించిన లాలా మస్తాన్ కుటుంబసభ్యులను సోమవారం ఆత్మకూరు కంచి పరమేశ్వరరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

విచ్చలవిడిగా కాలంచెల్లిన కూల్‌డ్రింక్స్

చేజర్ల, జూన్ 10: మండలంలో కాలంచెల్లిన కూల్‌డ్రింక్స్ తాగి ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారు. నాలుగు రోజులు కిందట చిత్తలూరులోని యువకులు మజా కొనుగోలు చేయగా అమ్మకం తేదీ గడువు ముగిసిన బాటి ళ్లను గుర్తించి దుకాణదారులను ప్రశ్నించారు. వారికి దీనిపై అవగాహన లేకపోవడంతో తెల్లబోయారు.

సాగరంలో వైద్యసిబ్బంది ర్యాలీ

అనంతసాగరం, జూన్ 10: మండలకేంద్రంలో సోమవారం వైద్యసిబ్బంది మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



కార్ల స్టాండ్‌గా ఆసుపత్రి!

కావలి, జూన్ 10: కావలి ఏరియా వైద్యశాల ప్రాంగణం కార్లస్టాండ్‌గా మారింది. వైద్యశాలలో నూతన భవనం నిర్మాణం అనంతరం గతంలో వైద్యశాల ముదటిలోనే ఉన్న పాత భవనం పూర్తిగా తొలగించారు. దీంతో అక్కడ విశాలమైన స్థలం ఉండటంతో దానిని చదును చేసి వైద్యశాల పార్కింగ్ కోసం ఉంచారు. అయితే వైద్యశాల పట్టణ నడిబొడ్డున ట్రంకురోడ్డును ఆనుకుని ఉండటంతో వివిధ పనుల నిమిత్తం పట్టణంలోకి వచ్చినవారు తమ కార్లను వైద్యశాలలో పార్కింగ్ చేసుకుని వెళుతున్నారు. అలాగే పరిసర ప్రాంతాల వ్యాపారులకు కూడా తమ దుకాణాల వద్ద కారు పార్కింగ్ స్థలం లేకపోవడంతో వారు కూడా వైద్యశాల ఆవరణలో తమ కార్లను పార్కు చేసుకుని వెళుతున్నారు. దీంతో వైద్యశాల ఆవరణం కారు పార్కింగ్ ప్రదేశంగా తయారైంది. దీంతో ఆసుపత్రికి అత్యవసర పనుల మీద వచ్చినవారి వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందికరంగా ఉంది. వైద్యాధికారులు స్పందించి వైద్యశాల ఆవరణలో ఇతరుల కార్లు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబును కలిసిన ఇంటూరి



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఇంటూరి

కందుకూరు, జూన్ 10 : టీడీపీ జాతీ య అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి చంద్రబాబునాయుడు ఢిల్లీ రాజకీయాలకు సమయం కేటాయించడంతో ఆయనను కలిసేందుకు సమయం పట్టిందని, మంగళవారం టీడీఎల్పీ సమా వేశం, బుధవారం ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం ఉండటం తో రెండు రోజులపాటు అమరావతిలోనే నాగేశ్వరరావు ఉంటారని సమాచారం. కాగా, నాగేశ్వరరావును సోమవారం ఉదయం బడేవారిపాలెంలోని ఆయన నివాసంలో పలు శాఖల అధికారులు, వివిధ గ్రామాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. అలాగే కందుకూరులోని పార్టీ కార్యాలయంలోనూ పలువురు ఆయనను కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కందుకూరు మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు అభినందనలు తెలిపారు.

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

కావలి, జూన్ 10: చట్టబద్ధత మరచి ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా కొత్త కార్మికులను విధుల్లోకి తీసుకున్న స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక జర్నలిస్ట్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమిషనర్ కొంత ప్రలోభాలకు ఆశపడి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పాడని 27మంది కొత్త వారిని కార్మికులుగా చేర్చుకుని 10మందికి జీతాలు రాయటం చట్ట విరుద్ధం అన్నారు. కొత్త వారిని చేర్చు కోవాలంటే కౌన్సిల్ తీర్మానం కాని ప్రత్యేకాధికారైన ఆర్డీవో తీర్మానం ఉండాలన్నారు. అలా తీర్మానం చేసి జిల్లా ఆప్కాస్‌కు పంపితే అక్కడ ఆమోదించి కలెక్టర్‌కు పంపితే ఆయన పరిశీలించి రాష్ట్ర ఆప్కాస్‌కు పంపిస్తారన్నారు. అక్కడ ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకుంటారన్నారు. ఇవన్నీ లేకుండా కమిషనర్ కొత్త వారికి జీతాలు ఎలా పెడతారని ప్రశ్నించారు. జిల్లా ఆప్కాస్‌లో సమాచారం తెలుసుకుంటే కొత్తవారి పేర్లు ఎవరివీ లేవని చెపుతున్నారని తెలిపారు. ఈ విషయంపై నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు, ఏఐటీయూసీ నాయకులు చేవూరు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకరానికి బస్సు ఏర్పాటు

అల్లూరు, జూన్ 10: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి పాల్గొనే వారి కోసం అల్లూరు నుంచి బస్సును ఏర్పాటు చేసినట్లు సోమవారం ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మంగళవారం రాత్రి 10 గంటలకు స్థానిక రామకృష్ణా జూనియర్ కళాశాల వద్దకు చేరుకోవాలన్నారు. పాల్గొనే వారికి అవసరమైన వసతులు ఏర్పాటు చేశామని పాల్గొనేవారు ముందుగా కార్యాలయంలో సమాచారం ఇవ్వాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన

కావలిటౌన్, జూన్ 10: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందళన తప్పదని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక సీఐటీయూ నేతలు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం మేనేజర్ షేక్ సికిందర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు అధికారులకు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని, ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించాలన్నారు. హెల్త్ అలెవెన్సులు, సక్రాంతి కానుకలు సమ్మె కాలం జీతాలతో పాటు కార్మికులకు ఇవ్వాల్సిన సమదుస్తులు గ్లౌజులు, ఇవ్వడం లేదని వాపోయారు. తక్కువ జీతాలతో ఎక్కువ పనులు చేయించడం శ్రమ దోపిడీ చేయడమేనన్నారు. ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, బీ రమేష్, తురకా శీనయ్య, మహేష్, జేమ్, బాబు పాల్గొన్నారు.

విద్య విజ్ఞానానికి, క్రీడలు ఆరోగ్యానికి అవసరం

బిట్రగుంట, జూన్ 10: విద్యార్థులకు విద్య..విజ్ఞానాన్ని ఏవిధంగా అందజేస్తుందో క్రీడలు ఆరోగ్యానికి అవసరమని కావలి మాజీ ఏఎంసీ ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్ అన్నారు. బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఇంగ్లీష్ మీడియం లిటిల్ ఇంగ్లాండ్ క్రీడా మైదానంలో బీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు జరిగిన సమ్మర్ ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంప్ సోమవారం ముగిసింది. సీనియర్ క్రీడాకారుడు ఎస్‌ఏ నవీద్ పర్యవేక్షణలో 35మంది చిన్నారులకు ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ షూ, జెర్సీ, షార్ట్‌లను దేవరాల, వాకర్స్ అధ్యక్షుడు ఎం.స్వర్ణన్ రాజు, శేషాద్రిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మోజస్‌చిట్టి, దీపు, నైనిల్, పండు, కోచ్ అఖీల్ ఉన్నారు. ఈ సందర్భంగా బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ఆహ్వానం మేరకు రైల్వే క్రీడా మైదానికి విచ్చేసిన దేవరాల సుబ్రహ్మణ్యంను అధ్యక్షులు స్వర్ణన్‌రాజు, కార్యదర్శి పీ.జీవన్‌కుమార్, సభ్యులు రామయ్య, శ్యాంసుధాకర్‌లు సన్మానించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

● సబ్ కలెక్టరు విద్యాధరి

కందుకూరు, జూన్ 10: కందుకూరు డివిజన్‌లో ప్రజల సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా అర్జీల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు సబ్ కలెక్టరు జి విద్యాధరి సోమవారం తెలిపారు. డివిజన్‌లోని ఏడు మండలాల్లో నిర్ణీత తేదీలలో ఈ కార్యక్రమం నిర్వహించి అన్ని శాఖల అధికారులు అక్కడ అందుబాటులో ఉండేలా చూసి వీలైనంత వరకు అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు ఆమె వివరించారు. ఈనెల 11న లింగసముద్రం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో, 12న ఉలవపాడు వెలుగు కార్యాలయం ప్రాంగణంలో, 13న వలేటివారిపాలెం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమం తొలివిడత నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆయా మండల తహసీల్దారులు, ఎంపీడీఓలు సంయుక్తంగా ఈకార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేయటంతో పాటు అన్నిశాఖల మండలస్థాయి అధికారులు తగు సమాచారంతో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశాలు జారీచేసినట్లు వివరించారు. అలాగే ఈ కార్యక్రమంపై ప్రజలకు తెలిసేలా మండల పరిధిలోని అన్ని గ్రామాలలో దండోరా వేయించాలని ఆదేశించినట్లు, డివిజన్‌లోని అన్ని మండలాల్లో సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

నేడు లింగసముద్రంలో ప్రజా విజ్ఞప్తుల దినం

లింగసముద్రం, జూన్ 10 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా విజ్ఞప్తుల దినం జరుగుతుందని తహసీల్దారు జి శ్రీచరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ జి విద్యాధరి, ఎంపీడీఓ యు శేషుబాబు పాల్గొని సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'ఆక్స్‌ఫర్డ్' విద్యార్థి ప్రతిభ

కందుకూరు, జూన్ 10 : జేఈఈ అడ్వాన్స్‌డ్ జాతీయ స్థాయి ఫలితాలలో కందుకూరు పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి ఏ శ్యామ్ సిద్విలాస్ (2204) ర్యాంక్ సాధించాడు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్రస్థాయి ఫలితాలలో తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని, అధ్యాపకుల నిరంతర కృషి ఇలాంటి అసాధారణ ఫలితాలకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ర్యాంక్ సాధించిన విద్యార్థికి అభినందనలు తెలిపారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాల భాస్కరరావు, బీ నరేంద్ర బాబు, ప్రిన్సిపాల్ షావుల్ హమీద్ తదితరులు అభినందించారు.



శ్యామ్ చిద్విలాస్‌ను అభినందిస్తున్న ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు

నటుడు బాలకృష్ణ జన్మదిన వేడుకలు

కావలి, జూన్ 10: సినీ హీరో, హిందూపూరు శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలు సోమవారం ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. బాలకృష్ణ ఫ్యాన్స్ కావలి డివిజన్ అధ్యక్షుడు జ్యోతిబాబూరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ బాలయ్య అభిమానులకు ఎల్లవేళలా అండగా ఉంటానని చెప్పారు. అభిమాన సంఘం నాయకుడు జ్యోతిబాబూరావు నాయకత్వంలో ఇంత మంది అభిమానులు తరలిరావటం, ఉత్సాహంగా సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘాల నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, పోట్లూరి శ్రీనివాసులు, చవల రామకృష్ణ, అక్కిలగుంట సూరిబాబు, ఉప్పాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొండాపురం: బాలకృష్ణ జన్మదినాన్ని సోమవారం మండలకేంద్రంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేకును కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో పోలినేని రమేష్, చంద్రబాబునాయుడు, దాసరి అశోక్, నర్రా శివన్నారాయణ, బద్దిపూడి మాచర్ల, వీ.మణికుమార్ పాల్గొన్నారు.

జలదంకి: స్థానిక ఎన్డీఏ కూటమి కార్యాలయంలో సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ పుట్టినరోజు సందర్భంగా పార్టీ మండల మధుమోహన్‌రెడ్డి కేక్‌ను కట్ చేసి అభిమాన సంఘం నాయకులకు తినిపించారు. కార్యక్రమంలో అన్నవరం-2 ఎంపీటీసీ భ్యుడు కోర్సిపాటి మాధవరెడ్డి, జలదంకి సొసైటీ మాజీ అధ్యక్షుడు కొర్రపాటి రామారావు, టీడీపీ యువనేతలు నిమ్మకాయల మురళీయాదవ్, గంటా అశోక్‌నాయుడు, ముచ్చాల మధుసూదనరెడ్డి, బాలకృష్ణ పూనూరు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



బాలయ్య పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు



కావలి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కావ్య , బాలకృష్ణ అభిమానులు

బిట్రగుంట: స్థానిక నందమూరి అభిమాలు సురేష్, అశోక్‌నాయుడు, ఫిలిప్‌లు ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీలో వేడుకలు నిర్వహించారు. నెల్లూరు జిల్లా బాలయ్య అభిమాన సంఘం అధ్యక్షుడు ఎద్దుల రవి, కావలి బాలయ్యబాబు వీరాభిమాని శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై కేక్‌కట్, భోజన పొట్లాలు పంపిణీ చేశారు. బోగోలు కూడలిలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్వీపాలెం పంచాయతీ మాజీ సర్పంచ్ భవానీ, ఆదరణ కేంద్ర నిర్వాహకులు సింహాద్రిరావు, వీఎస్‌ఆర్‌పేట కొత్తూరు వార్డు నెంబరు బాలాజీ ఉన్నారు.

కందుకూరు, జూన్ 10: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని భారీ కేకు కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య, వేముల గోపాలరావు, మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గుడ్లూరులో...

గుడ్లూరు : నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన గుడ్లూరు బస్టాండ్ సెంటర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ అభిమానులు భారీ కేక్ కట్‌చేసి అల్పాహార విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, తోలకల ధనుష్, పువ్వాడి వేణు, మేకపోతుల రాఘవులు, రామకృష్ణ, కాపులూరి శ్రీను పాల్గొన్నారు.

చెరువుకట్టలకు మరమ్మతులు చేయాలి

● నీటిపారుదల శాఖ అధికారులకు రైతుల మొర

మనుబోలు, జూన్ 10: గత సంవత్సరం డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న చెరువుకట్టలను సోమవారం నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. మండలంలోని కొలనుకుదురు, పిడూరుపాళెం చెరువులను వర్షాలకు ముందు కోట్ల రూపాయలతో బాగుచేశారు. పనులు నామమాత్రంగా చేయడంతో వర్షాలకు కట్టలు దెబ్బతిన్నాయంటూ రెండు గ్రామాల రైతులు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి విన్నవించుకున్నారు. ఆయన ఆదేశాలతో నీటిపారుదల శాఖ డిఈఈలు అనిల్ కుమార్‌రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఏఈలు వేమారెడ్డి, ప్రసాద్‌లు పిడూరుపాళెం పెద్దచెరువు, కొలనుకుదురు చెరువులను పరిశీలించారు. కట్టలు సరిగా లేకపోవడంతో కోసుకుపోయాయంటూ రైతులు దెబ్బతిన్న చెరువు కట్టలను అధికారులకు చూపించారు. వర్షాకాలం వస్తోందని, కట్టలు ఇలానే ఉంటే తెగి నీరంతా పొలాలపై పడి నష్టపోతామంటూ రైతులు అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న కట్టలను, తూములను సరిచేయాలని కోరారు. దీనిపై డీఈ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చెరువులో ఉన్న నీటిని కిందకు పంపి, మరలా కాంట్రాక్టర్‌చే కట్టలకు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, సూరిశెట్టి నాగేశ్వరరావు, నిఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పిడూరుపాళెం చెరువుకట్టలను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

వైభవంగా వడాయతి ఉత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 10: జొన్నవాడ ఆలయంలో సోమవారం కామాక్షితాయికి వడాయతి ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు కుంభ హారతి మండపంలో ఏర్పాటుచేసిన ఊయలలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఉత్సవాలను పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకారంలో స్వామి,అమ్మవార్లు

ఘనంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం

ముత్తుకూరు: స్థానిక ప్రధాన కూడలిలో ఉన్న వీరాంజనేయస్వామి గ్రామోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి విశేష పూజలు చేశారు. ప్రధాన అర్చకులు నారాయణం రామకృష్ణమాచార్యులు, అవనాష్‌ల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ముత్తుకూరు వీధుల్లో స్వామివారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా సాగింది.


గ్రామోత్సవంలో వీరాంజనేయస్వామి

నూతన కార్యవర్గం ఎన్నిక

సైదాపురం, జూన్ 10: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏపీ హంస సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏపీ హంస హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ రాపూరు తాలూకా అధ్యక్షురాలిగా జోగి పద్మ, అసోషియేట్ అధ్యక్షుడిగా కెశ్రీహరి, సెక్రటరీ సీహెచ్ సుజిత్, ట్రెజరర్ సుప్రజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయలక్ష్మీ, కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు సుధాకర్ వైద్యులు జనార్దన్, శ్రావణి, జిల్లా వైస్ ఉపాధ్యక్షుడు రాజయ్య, నాయకులు శ్రీనివాసులు, రాజేష్, మజహారుల్లా తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నివారించాకే బూడిద తరలించాలి


బూడిద రవాణాను అడ్డుకున్న టీడీపీ నాయకులు

ముత్తుకూరు, జూన్ 10: జెన్‌కో థర్మల్ కేంద్రం బూడిద చెరువుల వద్ద ఏర్పడుతున్న కాలుష్య నివారణ చర్యలు తీసుకున్న తరువాత బూడిద రవాణా చేపట్టాలని మండల టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మలికార్జునయాదవ్ మాట్లాడుతూ ఎన్నికల్ కోడ్ ఉన్నప్పుడే కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని జెన్‌కో అధికారులను కోరామని, అయితే ఇప్పటికీ పట్టించుకోకపోవడంతో బూడిద రవాణాను అడ్డుకోవాల్సి వచ్చిందన్నారు. జెన్‌కో అధికారులకు చుట్టుపక్కల ప్రజల ప్రాణాలు లెక్కలేదని, బూడిదను గ్రామాలపైకి వదిలి చోద్యం చూస్తున్నారని, కాలుష్య నివారణ చర్యలు చేపట్టేంత వరకు బూడిదను తరలించేందుకు వీలులేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల తెలుగుయువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, సర్పంచు కావలి విజయ్‌కుమార్, నాయకులు విజీల్ రెడ్డి, కాంతారావు, శోభన్, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

టీడీపీ నేతల కుటుంబాలకు పరామర్శ

వెంకటాచలం : సర్వేపల్లికి చెందిన టీడీపీ నేతలు, సానుభూతిపరుల కుటుంబాలను సోమవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనయుడు, సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయ కర్త రాజగోపాల్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా పినిశెట్టి రమణయ్య, పాలపర్తి సుబ్రమణ్యం, గోత్తల కిష్టమ్మ, రామిశెట్టి సుబ్బమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్తగుంట శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేస్తామని రాజగోపాల్‌రెడ్డి గ్రామస్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెనాలి రమణయ్య, బద్వేలు చెన్నకృష్ణయ్య, మీసాల సురేంద్ర యాదవ్, కనుపూరు సురేంద్రరెడ్డి, సమాధి గోపికృష్ణ, కిషోర్ యాదవ్, సుమన్ యాదవ్, వంశీయాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, కరీముల్లా, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


పినిశెట్టి రమణయ్య చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 10: స్థానిక పెద్దూరులోని కోనేటిమిట్ట ప్రాంతానికి చెందిన ఓరుపల్లి వెంకటేశ్వర్లు(32) గత నెల 16వ తేదీన అదృశ్యం కాగా సోమవారం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. గత నెలలో బుచ్చిలో బార్బర్ షాపుకని వెళ్ళిన వెంకటేశ్వర్లు తిరిగి ఇంటికి రాలేదని, పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

జొన్నవాడలో టీడీపీ విజయోత్సవ ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 10: మండలంలోని జొన్నవాడలో సోమవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు.

విడవలూరు: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించినందుకు, నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యేలుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిలు గెలిచిన సందర్భంగా వరిణి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శ్రీనివాసులు, శ్రీనివాసతేజ్‌లు సోమవారం అధికారులకు స్వీట్లు పంచారు. తహసీల్దారు కార్యాలయంలోని డీటీ బానుప్రకాష్, ఆర్ఐ, సర్వేయర్, వీఆర్వోలకు, ఎంపీడీవో కార్యాయంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో దశరథరామిరెడ్డి, సిబ్బందికి మిఠాయిలను పంచారు.


విడవలూరులో..

వెంకటాచలం: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపొందిన సందర్భంగా వెంకటాచలంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో దువ్వూరు లక్ష్మమ్మ, హేమలత, చెత్తమ్మ, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్‌కు సత్కారం

వెంకటాచలం, జూన్ 10: విశాఖ దక్షిణ నియోజకవర్గం నుండి జనసేన పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచిన వంశీకృష్ణ యాదవ్‌ను సోమవారం సీమాంధ్ర బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, గృహ నిర్మాణ శాఖ ఏఈ చిట్టిబోయిన వెంకటేశ్వర్లు యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కామాక్షి యాదవ్ తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

గర్భిణులకు వైద్యపరీక్షలు

మనుబోలు, జూన్ 10: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు గేయపూజిత మాట్లాడుతూ ప్రతినెలా 9వ తేదీన పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వశిశు సురక్ష యోజన పథకం కింద గర్భిణులకు వైద్యపరీక్షలు చేసి, మందులు అందించి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నా మన్నారు. అందులో భాగంగా వైద్యపరీక్షలు, పోషకాహారం, ప్రసవం తరువాత శిశు సంరక్షణ, తల్లి పాల విశిష్టత గురించి అవగాహన కల్పించా మన్నా రు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాజయ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

ఉప్పొంగిన నిర్లక్ష్యం!

నగరపాలక సంస్థ అధికారుల పనితీరుకు నిదర్శనం ఈ చిత్రం. ఫత్తేఖాన్‌పేటలోని రైతుబజారు వద్ద సోమవారం మురుగు కాలువ ఉప్పొంగింది. రోడ్డుపై మురుగునీరు ప్రవహించడం, దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు అవస్థలు పడారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు


రైతు బజారు వద్ద రోడ్డుపై మురుగు నీరు

నమ్మితే గుండెల్లో పెట్టుకునే నైజం బాలకృష్ణది

● నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ● అట్టహాసంగా బాలయ్య పుట్టిన రోజు వేడుకలు

నెల్లూరు(వైద్యం), జూన్ 10: సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను నమ్మితే గుండెల్లో పెట్టుకుంటారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. అందుకు నిదర్శనం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అన్నారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే కోటంరెడ్డితో పాటు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌లు పాల్గొని కేక కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ మరింత పటిష్టం కావాలంటే కోటంరెడ్డికి, అబ్దుల్ అజీజ్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలను వేలాది మంది మధ్య జరుపుకోవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, నాయకులు సుబ్బానాయుడు, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, మామిడాల మధు, కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి తనయుడు ప్రజయ్‌సేనారెడ్డి, జనసేన నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కిశోర్, కాకు మురళీరెడ్డి, ఎన్‌టీకే ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు రవి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

● బాలయ్య పేరుతో ఉచిత వైద్యం : ప్రజయ్

తాను అమెరికా నుంచి తిరిగొచ్చాక బాలకృష్ణ పేరుతో పేదలకు ఉచిత వైద్యం అందిస్తానని కోటంరెడ్డి తనయుడు డాక్టర్ ప్రజయ్‌సేనా రెడ్డి తెలిపారు. బాలయ్య పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను అమెరికాలో ఎండీ పూర్తిచేసి తిరిగొచ్చాక పేదలకు ఉచిత వైద్యసేవలు అందిస్తానని స్పష్టం చేశారు.



● గుప్తాపార్క్ వద్ద టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు ఆధ్వర్యంలో నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. కేక్‌ను కట్ చేసి పార్టీ నేతలు, అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ధర్మవరం సుజాతరావు, డాక్టర్ గణేష్‌కుమార్, చెంగయ్య, కల్వకుంట్ల భాస్కర్, మహంకాళి వెంకటరమణయ్య, సిద్ధా కళాచారి, సీమకుర్తి వెంకటేశ్వర్లు, ముని శేఖర్, పద్మాబాయి తదితరులు పాల్గొన్నారు.

● **నెల్లూరు(విద్య) :** నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి వాకర్స్‌కు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ నేతలు బలరామయ్య నాయుడు, బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, షేక్.నసీర్‌అహ్మద్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

● గీతామయి వృద్ధాశ్రమంలో బాలయ్యబాబు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు పంచిపెట్టారు. నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమాల్లో బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు వై.రవి, అభిమానులు కేసీ కృష్ణ, అల్లంపాటి వెంకటరమణయ్య, మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ధర్మవరం సుబ్బారావు

నారాయణ, వీపీఆర్‌లతోనే నగరాభివృద్ధి సాధ్యం

● శివాలయంలో టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 10 : నెల్లూరు నగరాభివృద్ధి ఎమ్మెల్యే పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతోనే సాధ్యమని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు తిరుమల నాయుడు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించడంతోపాటు ఎమ్మెల్యేగా నారాయణ, ఎంపీగా వేమిరెడ్డిలు గెలుపొందిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు పత్తి జయరామయ్యనాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని స్మార్ట్ సిటీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, టిడ్కో ఇళ్ల, ఇవన్నీ ఎమ్మెల్యే నారాయణకే సాధ్యమన్నారు. ఎంపీ వేమిరెడ్డి కేంద్రం నుంచి పెద్ద మొత్తంలో నిధులు రాబట్టి నగరాన్ని, జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపుతారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకుంటున్ననేతలు

డీకేడబ్ల్యూలో హాస్టల్ భవనం ప్రారంభం

● పూర్వవిద్యార్థినుల దాతృత్వం

నెల్లూరు(విద్య), జూన్ 10: నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు అనుబంధంగా నడుస్తున్న హాస్టల్ భవనాన్ని పునర్నిర్మించి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు మాట్లాడుతూ కళాశాల పూర్వవిద్యార్థినుల సహకారంతో రూ.8.5లక్షలతో హాస్టల్ భవనం పనులు చేపట్టారన్నారు. తాము చదువుకున్న కళాశాలకు ఏదో చేయాలన్న సంకల్పంతో వారందరూ దాతృత్వం ప్రదర్శించి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.కొండయ్య, డిప్యూటీ వార్డెన్ జి.కరుణకుమారి, హాస్టల్ కమిటీ సభ్యులు శ్రీదేవి, రమాదేవి, రేవతి, పూర్వ విద్యార్థినులు రిటైర్డ్ లెక్చరర్ కె.కుసుమకుమారి, న్యాయవాది శేషమ్మ, హెచ్‌ఎం డాక్టర్ ఎస్.జయలక్ష్మి, ఇందూరు సుజాత, సీహెచ్.సుజాత, డాక్టర్ ప్రసన్న, పూర్ణచంద్రకుమారి, కృష్ణతులసి, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, సుధారాణి, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ్, రమణారెడ్డి, శ్రీధర్, వెంకట్రావు పాల్గొన్నారు.


భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్‌ఐవో

పోలీసు స్పందన ఉన్నట్టా.. లేనట్టా?

● కోడ్ ముగియడంతో ఎస్పీ స్పందనకు వచ్చిన ప్రజలు

● ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలు వద్ద సమాచారం ఇచ్చేవారు కరువు

● అధికారుల తీరుపై అసహనంతో వెనుదిరిగిన ప్రజలు

నెల్లూరు(క్రైం), జూన్ 10: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రతి సోమవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించే పోలీసు స్పందన కార్యక్రమం నిలిపి వేశారు. అయితే కోడ్ ముగియడంతో సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పోలీసు స్పందనలో తమ సమస్యలు ఎస్పీకి చెప్పుకునేందుకు ప్రజలు వచ్చారు. అక్కడ స్పందనకు సంబంధించి ఎలాంటి హడావడి లేకపోవడం, అసలు సమాచారం ఇచ్చేవారు కూడా లేకపోవడంతో అసలు స్పందన కార్యక్రమం ఉందా... లేదా తెలియక అయోమయంలో పడ్డారు. ఇదే విషయమై సమీపంలోని ఉన్న కొందరు పోలీసు సిబ్బందిని ప్రశ్నించగా తమకు తెలియదని సమాధానం ఇచ్చారు. దీంతో ప్రజలు చేసేది లేక ఎంతో దూరం నుంచి వచ్చాం.. కనీసం మా సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా లేకుండా పోయిందే అని నిటూర్చారు. కొందరు పోలీసు కార్యాలయంకు వెళ్లగా అక్కడ ఎస్పీ లేరని, ఏఎస్పీ స్పందన ఫిర్యాదులు తీసుకుంటారని చెప్పారు. అయితే ఈ విషయాన్ని ముందుగా పోలీసు కార్యాలయం ప్రజలకు తెలియజేస్తే ప్రజలు నేరుగా పోలీసు కార్యాలయానికి చేరుకొని వారి సమస్యలు చెప్పుకునే అవకాశం ఉండేది. పోలీసు అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో దూరప్రాంతాల నుంచి పోలీసు స్పందనకు ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలు వద్దకు వచ్చిన ప్రజలు తిరిగి వెళ్లాల్సి వచ్చింది.

ఉపాధి కూలీలకు జీపీఎస్ ఎత్తివేయాలి

● పీడీకి వ్యవసాయ కార్మిక సంఘం వినతి

నెల్లూరు(వైద్యం), జూన్ 10 : ఉపాధి హామీ కూలీలకు జీపీఎస్ ఎత్తివేయాలని కోరుతూ ఆ పథకం పీడీ వెంకటరావుకు వ్యవసాయ కార్మిక సంఘం నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ముగిసి మూడు నెలలు అయినందున పనులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఉపాధిహామీ పనులు ప్రారంభించాలన్నారు. పనిచేసే ప్రాంతానికి కూలీలకు రవాణా సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు, భూలోకం కాంతారావు, బెల్లంకొండ నాగమ్మ, తంబి రమణయ్య, విజయకుమార్, రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


పీడీకి వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఎన్నికల నిధులు ఇష్టారాజ్యంగా ఖర్చు!

● రోజువారి వేతనంలా పందారం

● పని చేయని జెరాక్స్ యంత్రాలకు బిల్లులు

నెల్లూరు(సిటీ), జూన్ 10 : సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు సిటీ నియోజకవర్గానికి సంబంధించి నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేశారంటూ కార్పొరేషన్ అధికారులు తాజాగా మరో విమర్శకు గురయ్యారు. ఎన్నికల విధుల్లో పనిచేసిన ఉద్యోగులకు రోజువారి వేతనం (భత్యం) కింద రూ.200 చెల్లించే అవకాశం ఉంది. ఈ నిధులను అనుకూల వ్యక్తులకు ఇష్టానుసారంగా ఇచ్చేశారంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ ప్రక్రియలో ఓ అధికారి కీలకంగా వ్యవహరించారంటూ విమర్శలు వస్తుండగా అతని అండదండలతో మరో చిరుద్యోగి పనిచేయని జెరాక్స్ యంత్రాలకు కూడా బిల్లులు పొందినట్లు తెలుస్తోంది. ఇవీ పని చేయకపోయినా అద్దె రూపేన నగదు పొందినట్లు సమాచారం. పనిచేసిన ఉద్యోగులకు భత్యం చెల్లించకపోవడంతో కార్పొరేషన్ కార్యాలయంలో రచ్చ నడుస్తోంది. ఎన్నికల నిధుల ఖర్చుపై ఆడిట్ లేకపోవడంతో అధికారులు ఇష్టానుసారంగా నిధులు ఖర్చు చేశారంటూ గుసగుసలు వినపడుతున్నాయి.

న్యాయవాదుల కృషి ఫలించింది : వేనాటి

నెల్లూరు(లీగల్), జూన్ 10 : జగన్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను అడ్డుకున్న న్యాయవాదుల కృషి ఫలించి రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి విజయం సాధించిందని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ -2022కి వ్యతిరేకంగా మొదట ప్రజా ఉద్యమాన్ని నిర్మించింది న్యాయవాదులేనని గుర్తుచేశారు. తాము ప్రజల తరపున పోరాటం చేస్తున్న నేపథ్యంలో ఎన్నికలు రావడం, కూటమి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వల్ల కలిగే నష్టాలను గురించి ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో ప్రజలు జగన్‌కు చెక్కు పెట్టి కూటమికి అధికారం కట్టబెట్టారన్నారు. టీడీపీ అధినేత ఈనెల 12న ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై 2వ సంతకం చేస్తానని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చంద్రబాబును అభినందించారు. ధరణి పోర్టల్ తెచ్చి కేసీఆర్ కొంప కూలిందని, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో జగన్ నడ్డి విరిగుతుందని తాను గతంలోనే చెప్పానన్నారు.

రామలింగార్చన అలంకారం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 10: నగరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న గజేంద్ర మోక్షం ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి రామలింగార్చన అలంకారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వాసవీ అమ్మవారికి, సీతారామ లక్ష్మణ స్వామి వార్లకు విశేష పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

జీసెస్ బొమ్మ వద్ద పారిశుధ్య పనులు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 10: నగరంలోని వైఎంసీ గ్రౌండ్స్ వద్ద ఏర్పాటు చేసిన జీసెస్ విగ్రహం వద్ద సోమవారం పారిశుధ్యం పనులు చేసేందుకు క్రిస్టియన్ సెల్ నేతలు శ్రీకారం చుట్టారు. విగ్రహం చుట్టుపక్కల శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బర్నాబాస్, ఊరందూరు, సురేష్‌బాబు, రాఘవ, దాసు పాల్గొన్నారు.

16న జనసేన విజయోత్సవ ర్యాలీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 10: జనసేన పార్టీ విజయోత్సవ ర్యాలీ ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ నేత నూనె మల్లికార్జున యాదవ్ తెలిపారు. నగరంలోని అమని గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించన సందర్భంగా 16వ తేదీన నగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీ విజయవంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్నవారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424



రూ.25 కోట్లు గోవిందా!

వైసీపీ నేతకు ముడుపులిచ్చి నష్టపోయిన తిరుమల వ్యాపారులు

అప్పుడే తట్టలపైబడ్డ టీడీపీ నేతలు

తిరుపతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో తట్టలు, షాపుల లైసెన్సుల రెన్యువల్ కోసం అధికార పార్టీ నాయకులకు దాదాపు రూ.25కోట్లు ముడుపులుగా చెల్లించుకున్న వ్యాపారులు, ప్రభుత్వం మారిపోవడంతో లబోదిబోమంటున్నారు. టీటీడీ పాలకమండలి ఆమోదం కూడా పొందిన ఈ వ్యవహారంలో వైసీపీ ముఖ్య నాయకుడు పెట్టిన ఎన్నికల మెలికవల్ల దుకాణాల ఏర్పాటు ఆగిపోయిందని, కొత్త ప్రభుత్వం కొనసాగిస్తుందనే నమ్మకం లేదని వారు ఆందోళన చెందుతున్నారు.తామిచ్చిన డబ్బులైనా వెనక్కివ్వండంటూ వారు ఆ నాయకుడి వెంట పడుతున్నట్టు సమాచారం.

తిరుమల కొండమీద షాపులు, తట్టల ఏర్పాటుకు టీటీడీ జారీ చేసే లైసెన్సులను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాల్సి వుంటుంది. కాలపరిమితి ముగిసిన వాటిని రెన్యువల్ చేసుకోవాలంటే ఉన్నత స్థాయి రాజకీయ సిఫారసుతో పాటు భారీగా డబ్బు ఖర్చు పెట్టుకోవాల్సి వుంటుంది. ఇలాంటి గడువు ముగిసిన సుమారు 230కు పైగా తట్టలు, 17 దుకాణాల లైసెన్సులను రెన్యువల్ చేసుకునేందుకు వాటిని కొనుగోలు చేసిన వ్యాపారులు కొందరు ఈ ఏడాది ప్రారంభంలో గ్రూపుగా ఏర్పడి ప్రయత్నాలు చేశారు. వైసీపీ ముఖ్యనేతను కలసి మొరపెట్టుకున్నారు. ఉత్త చేతులతో పనులు జరగవు కాబట్టి తలా కొంచెం చొప్పున రూ. పాతిక కోట్లు వసూలు చేసి ముఖ్యనేతకు ముట్టజెప్పారని సమాచారం. అందుకు తగ్గట్టే ఈ ఏడాది ఫిబ్రవరి 26న పాలకమండలి సమావేశంలో వీటికి అనుమతులు కూడా ఇచ్చేశారని తెలిసింది. వ్యాపారులు సంబరపడి షాపులు పెట్టుకునేలోగా సహకరించిన నేతే అడ్డుపుల్ల వేశారంటున్నారు. ఎన్నికల్లో వ్యాపారులు తమ పరిధిలో అధికార పార్టీకి మెజారిటీ తెప్పించిన తర్వాతే తట్టలు, షాపులు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇప్పిస్తామని చెప్పారంటున్నారు. అయితే ఎన్నికల్లో వైసీపీ ఊడ్చుకుపోయింది. వ్యాపారులకు అప్పగించిన బూత్‌లలోనూ జనసేనకు భారీగా ఆధిక్యత వచ్చింది. తిరుమల కొండపై జనసేన అభ్యర్థికి ఏకంగా 1200ఓట్ల మెజారిటీ వచ్చింది. దీంతో నాయకుడి తీరు తెలిసిన వ్యాపారులు ఆందోళనపడి టీటీడీ అధికారులను ఆశ్రయించారని చెబుతున్నారు.వాళ్లు చేతులెత్తేయడంతో పనీ జరగక, చేతులు మారిన డబ్బూ తిరిగి రాక వ్యాపారులు శోకాలు పెడుతున్నట్టు సమాచారం.

షాపుల తరలింపునకూ చుక్కెదురు!

ఇదే సమయంలో కొండపైన ఏడు దుకాణాలను భక్తుల రద్దీ ఎక్కువగా వుండే ప్రాంతాలకు తరలించేందుకు ఎన్నికలకు ముందు కొందరు ప్రయత్నించారు. కొంత చేతిచమురు వదుల్చుకుని మరీ అమోదం పొందినా వారి తరలింపులు పూర్తికాలేదు.ఈలోగా జాతకాలు తారుమారు కావడంతో వీరు కూడా ఆందోళన చెందుతున్నారు. గత గురువారం కీలక అధికారి వద్దకు వీరంతా కలిసి వెళ్ళి కలసి ప్రాధేయపడినట్టు సమాచారం.ఆయనా నిస్సహాయత వ్యక్తం చేయడంతో వీరు కూడా నిస్పృహతో వున్నారు.

కొండమీద దబాయింపు బదలాయింపులకు ఇప్పుడు టీడీపీకి అవకాశం వచ్చింది.దీంతో అప్పుడే కొందరు టీడీపీ నేతలు దూకుడు చూపుతున్నారు. ఎలాంటి అధికారిక అనుమతులతో నిమిత్తం లేకుండా తమకు తాముగా తిరుమలలో దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అది కూడా కీలక ప్రాంతాల్లో కావడం గమనార్హం. తిరుపతి కూటమి అభ్యర్థికి తొలిలోనే మద్దతు పలికిన టీడీపీ నేత ఒకరు సోమవారం ఏకంగా శ్రీవారి ఆలయం ఎదురుగా వున్న అఖిలాండం సమీపంలోనే నాలుగు తట్టలు ఏర్పాటు చేశారు. వీటికి టీటీడీ నుంచీ ఎలాంటి అనుమతులూ లేవు. అలాగే తిరుమలలో టీడీపీ నాయకుడిగా వ్యవహరిస్తున్న మరొకరు తానేం తక్కువ తినలేదని సోమవారమే పాత

ఇపుడు టీడీపీ నేతల దూకుడు

అన్నదాన సత్రం వద్ద నాలుగు తట్టలు ఏర్పాటు చేసుకున్నారు. వాటికి కూడా టీటీడీ నుంచీ అనుమతులు లేవు. పాత అన్నదాన సత్రం వద్ద భక్తుల రద్దీ చాలా ఎక్కువగా వుంటుంది. భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా వుండడంతో రెండేళ్ళ కిందట అధికారులు ఆ ప్రాంతంలోని తట్టలను తొలగించారు. ఇప్పుడు మళ్లీ ఇక్కడ తట్టలు వెలిశాయి. టీడీపీ ప్రభుత్వం ఇంకా ఏర్పడక ముందే ఆ పార్టీ నేతలు ఈ రీతిలో వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. తిరుమల వ్యవహారాల్లో అత్యంత క్రమశిక్షణ పాటించే టీడీపీ అధినేత చంద్రబాబు తాజా వ్యవహారాల పట్ల ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి వుంది.

పోస్టింగ్ ప్లీజ్!

టీడీపీ నేతల వెంటబడుతున్న పోలీసు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10: ప్రభుత్వాలు మారగానే పోలీసు బాసుల తీరు కూడా మారిపోతుంటుంది. కొత్త కొలువుల కోసం గెలిచిన నేతల ను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీ అయిపోతారు. కొత్త ప్రభుత్వం ఇంకా ప్రమాణస్వీకారం అయినా చేయకముందే తిరుపతి జిల్లాలో పోస్టింగుల కోసం పైరవీలు మొదలయ్యాయి. గత ఐదేళ్ళుగా వైసీపీ నాయకులతో బాగా అంటకాగిన వారు ఆందోళనలో ఉండగా, గుర్తించదగిన పోస్టులు దక్కకుండా ఉండిపోయినవారు ఊపిరి పీల్చుకుని తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలో మూడేళ్ళకు పైబడి పనిచేసిన వారినీ, అవినీతి ఆరోపణలున్నవారినీ, వైసీపీకి దగ్గరున్నారనే ఆరోపణలున్నవారినీ ఎన్నికలకు ముందు వీఆర్‌కు పంపారు. మరి కొందరు వైసీపీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్ళుగా పీటీసీలోనూ, వీఆర్‌లోనూ కొనసాగుతున్నారు. వీరంతా ఇప్పుడు కోరుకున్న స్థానాల్లో కొలువుదీరాలని ప్రయత్నాలు చేస్తున్నారు. విద్య, వైద్య కేంద్రంగా ఉన్న తిరుపతి, చుట్టుపక్కల స్థానాల మీదే అందరి



దృష్టి ఉంది. ఒక మాజీ మంత్రినీ, ఒక సీనియర్ టీడీపీ నాయకుడినీ ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికైన ఎమ్మెల్యేలను కలసి ప్రతిపాదనలు ఇస్తున్నారు. కడప, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో పనిచేస్తున్న ఐదారుగురు సీఐలు ఈ ప్రయత్నాల్లో చురుగ్గా ఉన్నారంటున్నారు. పనిలో పనిగా తిరుపతిలో పనిచేసి ఇటీవల ఎన్నికల కమిషన్ వేటుకు గురైన ఇద్దరు పోలీసు అధికారులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకునే దిశగా ఉన్నారని సమాచారం.

తిరుపతి కుర్చీకి పోటీ ఎక్కువ

తిరుపతి నగర డీఎస్పీ స్థానం మీద చాలా మందే ఆశ పెట్టుకున్నారని చెబుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీ అయిన ఇద్దరు అధికారులు గట్టి ప్రయత్నాల్లోనే ఉన్నారు. వీరు ప్రస్తుతం కృష్ణా, అనంతపురం జిల్లాల్లో పనిచేస్తున్నారు. వీరిద్దరికీ అధికార పార్టీలోని ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా వున్నట్లు సమాచారం. ఇక తిరుపతి ఈస్ట్, అలిపిరి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, సత్యవేడు, నగరి, చంద్రగిరి స్టేషన్లకు సీఐలుగా రావడం కోసం దాదాపు డజనుమంది పోటీ పడుతున్నారు. ప్రస్తుతం గుడివాడలో డీఎస్పీగా వున్న ఒక అధికారి గతంలో చిత్తూరులో పనిచేసిన అనుభవంతో ఇక్కడికి రావాలనుకుంటున్నట్టు చెబుతున్నారు. అలాగే పదేళ్ళ క్రితం అలిపిరి, తిరుపతి ట్రాఫిక్‌లో పనిచేసి ప్రస్తుతం డీసీఆర్‌బీలో వున్న అధికారి ఒకరు అలిపిరికి కానీ వీలుంటే తూర్పు సీఐగా కానీ రావడానికి మంతనాలు జరుపుతున్నారని తెలిసింది. అలాగే తిరుపతి జిల్లా నుంచి 13 మంది పోలీసు అధికారులు పొరుగు జిల్లాలకు వెళ్ళడానికి ఇంకోవైపు ప్రయత్నాలు చేస్తున్నారు.

మానవత్వమే శాపమైంది!

- రోడ్డుపై విగతజీవిగా పడి ఉన్నరైతు
- సాయం చేసేందుకు వెళ్లిన దంపతులపై దూసుకెళ్లిన పోలీసు వాహనం
- ఓ పాఠశాల కరస్పాండెంట్ దుర్మరణం
- ఏర్పేడు ఎస్‌ఐ తీరుపై దుమారం





ఎస్‌ఐ వాహనం ఢీకొని గాయపడ్డ కిరణ్‌కుమార్ - చనిపోయిన స్వప్న(పాతచిత్రం)



కల్వర్టును ఢీకొన్న కారు



కారు ప్రమాదంలో చనిపోయిన మంగయ్య

శ్రీకాళహస్తి, జూన్ 10: రోడ్డు ప్రమాదం బారిన పడిన వారిని ఆదుకుందామనుకోవడమే ఆ దంపతుల పాలిట శాపమైంది.పోలీసు వాహనం ఢీకొట్టి భార్య దుర్మరణం పాలవగా భర్త చేయి విరగ్గొట్టుకుని ఆస్పత్రిలో చేరాల్సివచ్చింది.ప్రమాదానికి కారణమైన ఎస్‌ఐ వాహనం కనీస బాధ్యత మరచి అక్కడినుంచి పారిపోవడం పట్ల తీవ్ర విమర్శలు రేగాయి.శ్రీకాళహస్తి మండలం సూరావారిపల్లికి చెందిన చెంచుబాబు, అదే గ్రామం దళితవాడకు చెందిన మంగయ్య(50) సొంత పనుల నిమిత్తం ఆదివారం రాత్రి కారులో వెంకటగిరికి బయల్దేరారు.ఎంపేడు వద్ద ఏర్పేడు - వెంకటగిరి రహదారిపై కారు అదుపు తప్పి పక్కన కల్వర్టును ఢీకొనడంతో కారు నడుపుతున్న చెంచుబాబు స్వల్పంగా గాయపడ్డాడు. వెనుక సీటులో కూర్చున్న మంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి మంగయ్య మృతదేహాన్ని కారు నుంచి వెలుపలకు తీసి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. తిరుపతి నగరం భవానీనగర్‌కు చెందిన న్యాయవాది కిరణ్‌కుమార్,ఆయన సతీమణి స్వప్న(42) వెంకటగిరి వెళ్లి తిరిగివస్తూ ఈ ప్రమాదాన్ని గమనించారు.తిరుపతి నగర శివారులోని తనపల్లిలో పాఠశాలను నడుపుతున్న స్వప్న పాఠశాలకు అవసర మైన బెంచీలు వెంకటగిరిలో అమ్మకానికి ఉండటంతో కారులో అక్కడికి భర్తతో కలిసి వెళ్లారు.తిరుపతికి తిరిగి వస్తుండగా ఎంపేడు వద్ద రోడ్డుపై ఒకరు విగతజీవిగా పడి ఉండడం, చుట్టూ కొందరు జనాలు ఉండటం గుర్తించి కారు ఆపి కిందకు దిగారు.క్షతగాత్రులకు సాయం అవసరం వుందేమో అనుకుని అక్కడికి వెళ్లారు.వెంకటగిరిలో ఎస్‌ఐగా పనిచేసిన జిలానీ ఇటీవల ఏర్పేడుకు బదిలీ అయ్యారు.వెంకటగిరిలోనే ఉంటూ ఏర్పేడుకు రోజూ వచ్చిపోయే వాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఎస్‌ఐ జిలానీ బొలేరో కారులో ఏర్పేడు నుంచి వెంకటగిరికి బయల్దేరాడు.ఎంపేడు వద్ద రోడ్డు ప్రమాదాన్ని, గుమికూడిన మనుషులను గమనించకుండా బొలేరో దూసుకెళ్లిన క్రమంలో స్వప్న రోడ్డుపై కొంతదూరం ఎగిరిపడింది. అలాగే ఆ కారు ఢీకొని ఆమె భర్త కూడా గాయపడ్డాడు. శ్రీకాళహస్తి మండలం గంగలపూడి దళితవాడకు చెందిన యువకుడు సురేష్ అటు వెళుతూ ఈ ఘటనను చూశాడు. దంపతులను ఢీకొన్న వాహనం కొంతదూరం ముందుకు వెళ్లి ఆగింది. అయితే అందులో నుంచి ఎవరూ దిగలేదు. అనంతరం స్పందించిన సురేష్ హుటాహుటిన దంపతులను వారి కారులోనే ఎక్కించుకున్నాడు. ఇది గమనించిన ఎస్‌ఐ వాహనం అక్కడి నుంచి వేగంగా ముందుకు సాగిపోయింది. సురేష్ క్షతగాత్రులైన దంపతుల కారులోనే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లేందుకు బయలుదేరాడు. కొంతదూరం ముందుకు వెళ్లిన తరువాత ప్రమాదానికి కారణమైన పోలీసు వాహనం వేగంగా వెళ్లడాన్ని వీడియో తీశాడు. ఆ వాహనంలోని నెంబరు ప్రస్తావిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. అనంతరం దంపతులను వెంకటగిరి ఆస్పత్రిలో చేర్పించాడు. పరీక్షించిన వైద్యులు స్వప్న అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుడిచెయ్యి విరిగిన కిరణ్‌కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి సురేష్ తరలించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు మంగయ్య మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కల్వర్టును కారు ఢీకొన్న ప్రమాదంపై మొదట కేసు నమోదు చేశారు. అనంతరం సోమవారం ఉదయం చికిత్స అనంతరం కిరణ్‌కుమార్ శ్రీకాళహస్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని జరిగిన ఘటనపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేశారు. వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో స్వప్న మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. వీరికి ఒక కొడుకు, కుమార్తె ఉన్నారు.

ఇదేం అమానుషం?

పోలీసు వాహనం కారణంగా జరిగిన ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందడం స్థానికంగా కొందరు చూశారు. ఘటన జరిగిన దగ్గర ఒక కంటైనర్ ఫాం హౌస్ ఉంది. అందులో రోడ్డుపై దృశ్యాలను నిక్షిప్తం చేసేలా రెండు సీసీ కెమెరాలున్నాయి.వెంకటగిరిలో కోడిపందేలు, పలు అసాంఘిక కార్యకలాపాల్లో ఎస్‌ఐ జిలానీ తలదూర్చినట్లు చాలాకాలంగా ఆరోపణలున్నాయి. ఇలాంటి కారణాలతోనే కొద్ది నెలల క్రితం ఏర్పేడుకు ఆయన బదిలీ అయ్యారు. ఆదివారం రాత్రి రోడ్డుపై ప్రమాదాన్ని చూశాక ఆగి సాయం చేయాల్సిన బాధ్యత ఎస్‌ఐపై ఉంది. కానీ కనీసం గమనించకుండా మనుషులపై వాహనం దూసుకెళ్లింది. కొంత దూరముందుకు వెళ్లి ఆగిన వాహనం ముందుకు వేగంగా వెళ్లిపోవడాన్ని అందరూ గమనించారు.అయితే పోలీసు శాఖలోని కొందరు అధికారులు ఈ ఘటనకు మసిపూసే ప్రయత్నం ముమ్మరం చేశారు. సోమవారం ఉదయం వరకు రోడ్డు ప్రమాదం బయటకు పొక్కకుండా విఫల యత్నం చేశారు. ఆ తరువాత చేసేదేమీ లేక కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసు వాహనం నెంబరుతో మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అంతటితో ఆగకుండా ఎస్‌ఐ జిలానీ వాహనం ఢీకొన్న ఘటన నిజమేనని దంపతులు రోడ్డు దాటుతుండగా జరిగిందని... ఎస్‌ఐ జిలానీయే వారిని పోలీసు వాహనంలో ఎక్కించుకుని వైద్యశాలకు తరలించి కాపాడే ప్రయత్నం చేశాడని శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేయడం విమర్శలపాలైంది.

శభాష్ సురేష్

ప్రమాదం పట్ల సురేష్ స్పందించిన తీరుపై ప్రశంసలు వెల్లువెత్తాయి. రోడ్డుపై ఘటన చూసిన వెంటనే హుటాహుటిన దంపతులను వారి కారులోనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు.పోలీసు వాహనం నెంబరును గుర్తు పెట్టుకున్నాడు. ఆ వాహనం ముందు వెళుతుండగా వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతోనే ఎస్‌ఐ దురాగతం వెలుగులోకి వచ్చింది. సురేష్ అంతటితో ఆగకుండా మృతురాలి కుటుంబానికి అండగా నిలిచాడు. పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని బంధువులు తీసుకునే వరకు వారి వెంటే ఉండి సాయం చేశాడు.

14న గోవిందరాజస్వామి ఆలయంలో పుష్పయాగం

తిరుపతి (కల్చరల్) జూన్ 10: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో జూన్ 14వ తేదీ శుక్రవారం పుష్పయాగం నిర్వహించనున్నట్లు టీటీడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం 13వ తేదీ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయంలో అంకురార్పణ నిర్వహిస్తారు. 14వతేదీ ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 4 గంటల వరకు పుష్పయాగం వైభవంగా జరుగుతుంది.

సిలికా మైన్ల హార్డ్ డిస్క్‌లు, ఫైళ్లు దహనం?

కోట, జూన్ 10 : కోట, చిల్లకూరు మండలాల్లోని సిలికా మైన్లకు సంబంధించిన సమాచారంతో కూడిన కీలక హార్డ్‌డిస్క్‌లు, సీడీలు, ఫైళ్లు దగ్ధం చేసినట్లు సమాచారం.ఈ రెండు మండలాల్లోని 1150.97 హెక్టార్లల్లో 73 సిలికా మైన్ల లీజులున్నాయి.ఈ మైన్ల నుంచి సంవత్సరానికి రూ.443 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం రావాల్సి ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో కీలక నేతలు కొంతమంది సిలికా మైన్లను సిండికేట్‌లోకి తీసుకొని కోట్లాది రూపాయల రాయల్టీని ప్రభుత్వానికి ఎగనామం పెడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ తరువాత గనుల శాఖ, ఏపీఎండీసీ సిలికా తవ్వకాలు జరపరాదని నిషేధం విధించింది. అప్పటి వరకు చిల్లకూరు, కోట మండలాల్లో అనధికారిక సిలికా లావాదేవీలు, బిల్లులు, రవాణాలకు సంబంధించిన సమాచారాన్ని అంతా హార్డ్‌డిస్క్‌లు, సీడీలు, ఫైళ్ల రూపంలో పొందుపరిచినట్లు సమాచారం. ఎలాగో వైసీపీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకంతో ఆ పార్టీ కీలక నేతలు ఇద్దరు ఈ సమాచారాన్ని గోప్యంగా ఉంచారు. ఈ నెల 4వ తేదీ కౌంటింగ్ తరువాత టీడీపీ అధికారంలోకి రావడంతో ఎక్కడ ఈ ఫైళ్ల బాగోతం బయటపడుతుందోనని కోట మండలం కొత్తపట్నం మైన్ల వద్ద ఆ సమాచారాన్ని నాలుగు రోజుల క్రితం రాత్రి వేళ తగులబెట్టినట్లు సమాచారం.ఒక పక్క బేవరేజస్‌పై తనిఖీలు జరుపుతూ శాఖలవారీగా ఫైళ్లు స్వాధీనం చేసుకుంటున్న ఆయా శాఖల ఉన్నతాధికారుల తీరుతో వైసీపీ నేతలు ఉలిక్కిపడ్డారు. దీంతో అనుమతులు ఒకచోట తీసుకుని మరోచోట సిలికా తవ్వకాలు జరపడంతో పాటు ఎగుమతులకు సంబంధించినవే బిల్లులను దహనం చేసినట్లు తెలిసింది.ఫైళ్లను కాల్చివేసిన సమాచారం గనుల శాఖ ఉన్నతాధికారులకు కూడా అందిందని సమాచారం.



కోట మండలం కొత్తపట్నంలో తవ్వుతున్న సిలికా (ఫైల్ ఫోటో)

పథకం ప్రకారమే నా భర్తను హత్య చేశారు

విజయకుమార్ భార్య ఆరోపణ



పోలీస్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఫుటేజీని తన మొబైల్‌లో చూపిస్తున్న మునెమ్మ

వెంకటగిరి, జూన్ 10: తన భర్త విజయకుమార్ జనసేనలో చురుకుగా ఉంటున్నారని కక్ష గట్టి వైసీపీ నాయకులు పథకం ప్రకారం హత్య చేయించారని మృతుడి భార్య మునెమ్మ ఆరోపించారు. సోమవారం పోలీస్ స్టేషన్ వద్ద మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మునెమ్మ మాట్లాడుతూ... తన భర్తను బార్ నుంచి బయటకు లాక్కొచ్చి కత్తితో పలుమార్లు పొడిచి చంపారన్నారు. సీసీ కెమెరా ఫుటేజీని ఆమె తన మొబైల్‌లో చూపారు. హత్య వెనుక అసలు దోషులను పోలీసులు అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జనసేనలో కీలంగా ఉన్న తన కుమారుడిని అడ్డుతొలగించాలని భావించే హత్యకు కుట్రపన్నారని మృతుడి తండ్రి నరసింహులు చెప్పారు. ముమ్మాటికి ఇది రాజకీయ హత్య అని అన్నారు. అసలు దోషులను అరెస్టు చేసేవరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. తన కుమారుడి హత్య వెనుక బార్ పక్కన మంచింగ్ దుకాణం నడుపుతున్న వ్యక్తి హస్తం ఉందన్నారు. మధురెడ్డిని కూడా పోలీసులు అరెస్టు చేసి విచారిస్తే అసలు దోషులు ఎంతమంది ఉన్నారో తెలు స్తుందన్నారు. కాగా విజయ్‌కుమార్‌ని హత్యచేసిన నిందితుడుని పోలీసులు అరెస్టు చేశారని తెలుసుకున్న హతుడి బంధువులు అతన్ని తమకు చూపిం చాలని పట్టుబట్టారు. సీఐ సంఘమేశ్వర రావు ఆందోళనకారులకు నచ్చచెప్పి అక్కడి నుంచి పంపేశారు.


మాంబట్టు సెజ్ డంపింగ్‌యార్డులో అగ్నిప్రమాదం



భారీగా ఎగిసిపడుతున్న అగ్నికీలలు

తడ, జూన్ 10: మండల పరిధిలోని మాంబట్టు సెజ్‌లో ఓ డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మాంబట్టు సెజ్‌లోని తైచికాస్ట్ పరిశ్రమకు సమీపంలో ప్రైవేట్ వ్యక్తులకు చెందిన డంపింగ్‌యార్డు ఉంది. అక్కడ అన్ని రకాలైన పనికిరాని వస్తువులన్నీ డంప్ చేసి ఉన్నారు. సోమవారం సాయంత్రం ఆ డంపింగ్‌యార్డులో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో పక్కనే ఉన్న తైచికాస్ట్ పరిశ్రమ ఆ మంటలను ఆర్పేందుకు ప్రయ త్నిస్తూనే స్థానిక పోలీసులకు, అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించింది. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మంటలను అదుపుచేసేందుకు త్రీవంగా శ్రమిస్తున్నారు. అగ్నిమాపక దళానికి చెందిన రెండు ఫైరింజన్లు, అపాచీ పరిశ్రమకు చెందిన మరో ఫైర్ ఇంజన్ మంటలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నా పెద్ద ఎత్తున ఎగిసి పడుతున్నాయి. దీనికితోడు ఈదురుగాలులు సైతం తోడయ్యాయి. రాత్రి 7.30 గంటలు గడుస్తున్నా మంటలు అదుపులోకి రాకపోవడంతో పక్కనే ఉన్న తైచీకాస్ట్ పరిశ్రమకు ప్రమాదం పొంచి ఉండటంతో ఆందోళన నెలకొంది.

విద్యుదాఘాతానికి గురై ఒకరి మృతి



ఆనందయ్య మృతదేహం

పెళ్లకూరు, జూన్ 10: ప్రమాదవశాత్తు విద్యుదా ఘాతానికి గురై ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని పాలచ్చూరులో జరిగింది. దిరసనమాలకి చెందిన ఏ.ఆనందయ్య (55) స్థానిక విద్యుత్ లైన్‌మెన్‌కు సహాయంగా ఉంటూ గ్రామంలో ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పాలచ్చూరు అరుంధతీ కాలనీలో విద్యుత్ వైర్లుకు అడ్డంగా ఉన్న చెట్లను ఎల్‌సీ తీసుకుని తొలిగించారు. అనంతరం తెగిన విద్యుత్ వైర్లును సరిచేసే క్రమంలో పక్కనే కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫాం నుంచి విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ట్రాన్స్‌కో శాఖ ఏఈ అంజాద్ బాషా తెలిపారు. మృతుడికి భార్య రత్నమ్మ, కుమారుడు శ్రీచక్రకుమార్ ఉన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

పెళ్లకూరు, జూన్ 10 : మండలంలోని చింతపూడిలో ఆదివారం రాత్రి ఓ మహిళ మెడలో నాలుగు సవర్ల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుని వెళ్లాడు. గ్రామానికి చెందిన టి.గంగమ్మకు చాలాకాలం క్రితం పక్షవాతంతో మంచానికే పరిమితమైంది. రాత్రి సమయంతో గంగమ్మ ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ గ్రామానికి చేరుకుని కేసును నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

నాయుడుపేట టౌన్, జూన్ 10: పట్టణంలోని దర్గారోడ్డులో ఉన్న ఓ నివాసంలో అనుమానస్పద స్థితిలో వెంకటరమణయ్య (55) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకువెంకటరమణయ్య కుటుంబసభ్యులతో కలసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం నివాసం ఉంటున్న ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన వెంకటరమణయ్యను పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మృతిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

బైక్‌తో ఉడాయించిన దొంగల అరెస్టు

తడ, జూన్ 10: దారికాచి బెదిరించి బైక్‌తో ఉడాయించిన ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాత్రి వరదయపాళ్యం మండలం పులియారం గ్రామానికి చెందిన పరంధాం, రవి అపాచీ పరిశ్రమలో విధులకు బైక్‌పై వెళ్తుండగా దారికాచి వారిని బెదిరించి వాహనంతో ముగ్గురు ఉడాయించిన సంగతి తెలిసిందే. ఆ కేసుకు సంబంధించి వెండ్లూరుపాడుకి చెందిన తేజ, సూళ్లూరుపేటకు చెందిన వరుణ్‌రాకేష్, దినేష్‌ను నిందితులుగా గుర్తించిన పోలీసులు సోమవారం ఉదయం కాదలూరు రోడ్డు వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

సూళ్లూరుపేట, జూన్ 10: సూళ్లూరుపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 11న మంగళవారం గాండ్లవీధిలోని స్త్రీ స్వశక్తి భవనంలో జరుగుతుందని కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులందరూ పాల్గొనాలని పేర్కొన్నారు.

మలేరియా మహమ్మారిని తరిమికొడదాం

కోట, జూన్ 10: మలేరియా మహమ్మారిని అవగాహనతో తరిమి కొడతామని వైద్యాధికారులు పిలుపునిచ్చారు. మండలంలోని చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో సోమవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు జరిగాయి. చిట్టేడు గ్రామంతోపాటు కోట బస్టాండ్ సెంటర్‌లో అవగాహన ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మలేరియా దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెలాథిన్ పౌడర్‌ను స్ప్రేచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నాగరాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ రామరాజు, సిబ్బంది పెంచలయ్య, లక్ష్మీపతి, రమేష్‌బాబు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తీర ప్రాంత గ్రామాల రోడ్డుకు మోక్షం కలిగేనా?

టీడీపీ అధికారంలోకి రావడంతో

చిగురించిన ఆశలు



కోతకు గురైన పేర్నాడు రోడ్డు - ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు - వేనాడు సమీపంలో కోతకు గురైన పులికాట్ పెద్ద బ్రిడ్జి

సూళ్లూరుపేట, జూన్ 10: అటవీశాఖ అడ్డంకులతో కలగా మిగిలిన కొరిడి-పేర్నాడు తారు రోడ్డు నిర్మాణం టీడీపీ ప్రభుత్వం రాకతోనైన మోక్షం కలుగుతుందని గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. మండల పరిధిలో పులికాట్ సరస్సు పరిధిలోని మూడూ పంచాయతీల్లో 23 గ్రామాలున్నాయి. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అట్టకానితిప్ప వరకు తారురోడ్డు ఉంది. అక్కడ నుంచి 9 కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డుతోనే కాలం గడుపుతున్నారు. ఉన్న ఆ రోడ్డు అధ్వానంగా ఉండడంతో గమ్యం చేరేవరకు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణిస్తుంటారు. పులికాట్ సరస్సు మధ్యలో ఉన్న గ్రావెల్ రోడ్డు చిన్నపాటి వర్షమొచ్చినా బస్సులు రాకపోకలు సాగించలేని పరిస్థితి. అటవీశాఖ అభ్యంతరాలతో ఆగిన వారు రోడ్డు నిర్మాణ పనులను గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోలేదు. గత ఏడాది డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుఫాన్ వరదకు ఈ రోడ్డు కోతకు గురైంది. దాదాపు రెండు వారాల పాటు ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. పలుచోట్ల రోడ్డుపై గ్రావెల్, రివిట్‌మెంట్ కూడా కొట్టుకుపోయినా పాలకులు పట్టించుకోలేదు. ఎన్నికల ముందు అరకొర మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో అక్కడక్కడ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. కల్వర్టుల వద్ద రోడ్డు కోతకు గురైంది. 29 ఏళ్లగా ఈ గ్రామాలకు తారురోడ్డు కలగానే మిగిపోయింది. 2014 టీడీపీ హయాంలో తారు రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినా ప్రభుత్వం మారడంతో ఆ పనులు అటకెక్కాయి. అదే విధంగా ఇదే మార్గం నుంచి వెళ్లే వేనాడు దీవి రోడ్డు పరిస్థితి ఇదే విధంగా ఉంది. టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో ఈ గ్రామాలకు తారురోడ్డు మోక్షం కలుగుతుందని గ్రామస్తుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే విజయశ్రీ



భారీ కేక్‌ను కట్‌చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారధి దంపతులు

నాయుడుపేట, జూన్ 10: రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని అగ్రహారపేటలో సోమవారం టీడీపీ నాయకుడు బాబు ఆధ్వర్యంలో మాతమ్మ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయం నుంచి టీడీపీ నాయకులు మాతమ్మ ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, టి.సుధాకర్‌రెడ్డి, ఏ.రమేష్, నాయకులు షేక్‌రఫి, నెలవల రాజేష్, శ్రీనివాసులునాయుడు, విజయకుమార్‌నాయుడు, ఎం.రాజశేఖర్, మధునాయుడు, గూడూరు సుధీర్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ధాన్యం వ్యాపారులు దాసరి ప్రభాకర్‌నాయుడు, పూనాటి తిరుమలనాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు భారీ కేక్ కట్ చేసి టీడీపీ నా యకులకు, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డి. కృష్ణమనాయుడు, డి.రమేష్‌నాయుడు, కె. హరినాయుడు, కె.కిరణ్‌నాయుడు, ఎం.వెంకటరత్నంనాయుడు, ఎం.ప్రసాద్‌నాయుడు, కె.ప్రదీప్‌నాయుడు, డి.బాలచంద్రరాజు, కె.రషీద్, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: కార్యకర్తలు పడిన కష్టం ఫలితమే తన కుమార్తె విజయశ్రీ విజయమని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. కొత్తూరు టీడీపీ కార్యాలయంలో పెళ్లకూరు మండలంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చిన అధ్యక్షుడు సంచి కృష్ణయ్యను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ... పార్టీ నాయకులను కృష్ణయ్య సంఘటితం చేయడంతోనే మెజార్టీ వచ్చిందన్నారు. రానున్న ఐదేళ్లలో కక్షసాధింపులు ఉండవని నెలవల చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు డి.ప్రసాద్‌నాయుడు, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, టి.సుధాకర్‌రెడ్డి, సూళ్లూరుపేట జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తగ్గ తనయుడు బాలకృష్ణ



గూడూరులో జరిగిన సంబరాలు - నాయుడుపేట టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

గూడూరు, జూన్ 10: సినీ, రాజకీయ రంగాల్లో తండ్రికి తగ్గ తనయుడిగా బాలకృష్ణ రాణిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం గూడూరు టీడీపీ కార్యాలయంలో బాలకృష్ణ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో బాలకృష్ణ ప్రచారం నిర్వహించి టీడీపీ విజయానికి కృషి చేశారన్నారు. హిందూపురం నుంచి మూడో సారి ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. అనంతరం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమం, నిరాశ్రయల కేంద్రంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసులు, ఔరంగబాషా, వెంకటేశ్వర్లురాజు, జనార్దన రెడ్డి, రమణయ్య, సురేంద్ర, కృష్ణయ్య, రత్నయ్య, నారాయణగౌడ్, మోహన్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే విజయశ్రీ ఆధ్వర్యంలో కోలాహలంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి భారీ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నేతలు ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, టి.సుధాకర్‌రెడ్డి, ఎం.రాజశేఖర్, జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, దార్ల రాజేంద్ర, బాబు, జి.సుధీర్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, నెలవల రాజేష్, పార్థసారధి, కిషోర్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

తడ: హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను వాటంబేడు కుప్పంలో ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మన శ్రీధర్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. టీడీపీ మత్స్యకార నాయకులు సుధాకర్, జయపాల్, బొమ్మన ఏకాంబరం, తదితరులు పాల్గొన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూన్ 10: వచ్చే ఏడాది జనవరి 26న భారత ప్రభుత్వం ప్రకటించే పద్మ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మురళీకృష్ణ సోమవారం తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజికసేవ, సైన్స్, ఇంజనీరింగ్, ప్రజా వ్యవహారాలు, పౌరసేవలు, వృత్తి, పరిశ్రమలు తదితర రంగాలలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన వ్యక్తులు అర్హులని పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పద్మాఅవార్డ్స్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని ఈనెల 22లోపు అలిపిరి వద్ద వున్న సెట్విన్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 0877-2286921, 94405 73537 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

20నుంచి హనుమ నాటకోత్సవాలు

తిరుపతి అర్బన్, జూన్ 10: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో ఈనెల 20నుంచి హనుమ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపకులు బి.ఎన్.రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. 20నుంచి 28వ తేదీ వరకు జాతీయస్థాయి పద్యనాటకాలు, సాంఘిక నాటికలు, కూచిపూడి, భరతనాట్యం, జానపద, సోలో నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనడానికి తెలుగు రాష్ట్రాల నుంచి 32 పద్య, 57 సాంఘిక నాటికల దరఖాస్తులు అందాయన్నారు. పరిశీలన అనంతరం 9 పద్య, 12 సాంఘిక నాటికల దరఖాస్తులను ఎంపిక చేశామన్నారు. ప్రతిభకనబరచిన ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, రోలింగ్ షీల్డ్స్, హనుమ అవార్డ్స్ జ్ఞాపికలు అందజేస్తామన్నారు. అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, విశ్వనాథరెడ్డి, విజయ్‌కుమార్, శోభ, కోటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరులో టీడీపీ విజయోత్సవాలు

చిల్లకూరు, జూన్ 10: సార్వత్రికల్లో టీడీపీ విజయం సాధించడంతో సోమవారం మండల కేంద్రంలోని మిక్సిడ్‌కాలనీ, కృష్ణాపురం గిరిజన కాలనీల్లో టీడీపీ నాయకుడు, పెంచలకోన ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విజయోత్సవాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చుతూ ప్రజలకు అభివాదం చేస్తూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తానంకి నానాజీ మాట్లాడుతూ... నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే పాశిం అభివృద్ధి పథంలో నడిపించగల సమర్థవంతమైన నాయకుడు అని నమ్మి ప్రజలు గెలిపించారన్నారు. పట్టాభి రామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము, బెల్లంకొండ మల్లికార్జున్, రామ్మూర్తి, నవీన్‌చంద్ర, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన 21వేల పాఠ్యపుస్తకాలు



కోట, జూన్ 10: పట్టణంలోని ఎమ్మార్సీకి సోమవారం 21 వేల పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు. 8, 9, 10 తరగతులకు పంపిణీ చేస్తామన్నారు. అదే విధంగా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 5,420 యూనిఫాం జతలు వచ్చినట్లు తెలిపారు. 1 నుంచి 7వ తరగతి వరకు 11 వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. అదే విధంగా 40వేల నోటు పుస్తకాలు చేరాయన్నారు.

దేశ చరిత్రలో నూతన అధ్యయనం



వెంకటగిరిలో స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వెంకటగిరి టౌన్, జూన్ 10: 75ఏళ్ల దేశ చరిత్రలోనే బీజేపీ నూతన అధ్యాయానికి నాంది పలికిందని వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ మాజీ ఇన్‌చార్జి టీటీ మణి అన్నారు. ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని స్థానిక క్రాస్ రోడ్డులో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్లల్లో మోదీ చేసిన సంక్షేమ పథకాలే ఆయనకు శ్రీరామరక్షగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో రవి, షణ్ముక, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని మండలంలోని పోటుపాళెంలో సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు గాలి ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌నాయుడు మాట్లాడుతూ... కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాయన్నారు. రాష్ట్రాభివృద్ధి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమన్నారు. మధు, బాషా, నరేష్, సంపత్, సుధాకర్, సుమన్, కోటేశ్వరరావు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులతో వైసీపీ నేతల భేటీ



నాయుడుపేట, జూన్ 10: వైసీపీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి, నాయుడుపేట జడ్పీటీసీ కట్టా జ్యోతి దంపతులు సోమవారం ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను కూడా మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. ఇలా వీరు టీడీపీ ఎమ్మెల్యేలను కలుస్తుండటంతో తెలుగుదేశం వైపు మొగ్గుచూపుతున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

నాయీ బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడికి సన్మానం

నాయుడుపేట, జూన్ 10: టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు శాంతారాంను ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినుకొండ ధనంజయ ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. కుప్పం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణస్వీకారానికి వెళ్తున్న ఆయన్ను మార్గమధ్యంలో నాయుడుపేటలో సోమవారం సమితి నా యకులు సన్మానించారు. ఆనంద్, కుమార్, మునికృష్ణ, శివ, శ్రీను, నరేష్, ప్రతాప్, బాలాజీ, సాయి, మస్తాన్ తదితరులున్నారు.

కిలో టమోటా రూ.60



గూడూరు, జూన్ 10: గూడూరులో సోమవారం కిలో టమోటా రూ.60 పలికాయి. గూడూరు కూరగాయల మార్కెట్‌కు కలికిరి, మదనపల్లె, కోల్‌కతాల నుంచి టమోటాలు దిగుమతి అవుతుంటాయి. గత వారం కిలో రూ.30 నుంచి రూ.40 వరకు ఉండగా, సోమవారం ఉన్నట్టుండి కిలో రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయించారు. దిగుబడులు తగ్గడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. పెరిగిన టమోటాల ధరలను చూసి ప్రజలు విస్తుపోతున్నారు.

ఊట గుంటలతో భూగర్భ జలాలు

బాలాయపల్లి, జూన్ 10: ఊట గుంటలు తవ్వడం ద్వారా భూగర్భ జలాలు పెంచుకోవచ్చుని డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. సోమవారం బాలాయపల్లి పంచాయతీలోని చుట్టి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీటిని ఊటగుంటల్లో ఉండే విధంగా చేసుకోవాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ముత్యంజయరాం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



కొత్తగా ఎంపికైన కమిటీ

గూడూరు, జూన్ 10: వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఏపీహంస జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రావు అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఏపీ హంస (హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్)గూడూరు తాలూకా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గూడూరు తాలూకా అధ్యక్షురాలిగా రేవతి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా హజరత్తయ్య, కార్యదర్శిగా ముజీబ్, ట్రెజరర్‌గా విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రవీణతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. రాజయ్య, కమల్‌కిరణ్, డాక్టర్ షరీనా, డాక్టర్ రవికుమార్, గౌరీ, శకుంతల, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



గూడూరు, జూన్ 10: పట్టణంలోని రాజావీధిలో కొలువై ఉన్న గంగమ్మ ఆలయంలో సోమవారం వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అమ్మవారిని పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణంలో మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 10: స్థానిక ఏరియా ఆసుపత్రిలో సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రామ్మోహన్‌రావు దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ షరీనా మాట్లాడుతూ... సమాజంలో మూఢ నమ్మకాలు, సైన్స్ పట్ల అవగాహన కల్పించడమేకాకుండా సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా పౌష్టికాహాన్ని పంపిణీ చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా, రామ్మోహన్‌రావు, సుబ్బారావు, నాగరాజు, రాధయ్య, ప్రభాకర్, శ్రీనివాసులు, ఆనంద్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

బోర్ల మరమ్మతులకు చర్యలు

గూడూరు అర్బన్, జూన్ 10: పట్టణంలోని గాంధీనగర్‌లో నీటిసమస్య తలెత్తడంతో స్థానికులు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బందితో వెళ్లి సోమవారం గాంధీనగర్‌లో మరమ్మతులకు గురైన బోర్లు, పైప్‌లైన్లను పరిశీలించారు. గాంధీనగర్, ప్రశాంతినగర్‌లలో పైప్‌లైన్లకు, బోర్లకు మరమ్మతులు సోమవారం నుంచే చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సురేంద్ర, ఉదయ్‌కుమార్, రమేష్‌రెడ్డి, శ్యామ్‌బాబు, వంశీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీల్‌కు అభినందనలు



గూడూరు, జూన్ 10: నియోజకవర్గ పరిధిలోని పలువురు నాయకులు, వివిధ అసోసియేషన్ల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే నివాసంలో సోమవారం పాశిం సునీల్‌కుమార్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్నికల్లో తనను గెలిపించినందుకు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. గూడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఎన్నికల ప్రచారంలో గూడూరులో రోడ్ షోలో పాల్గొని తన విజయానికి సహకరించిన నందమూరి బాలకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీకి చర్యలు

వాకాడు, జూన్ 10: మండలంలో ఆయా గ్రామాల్లో శ్రీనిధి రుణాల చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకుంటున్నామని ఏజీఎం హేమంత్‌కుమార్ చేప్పారు. మండలంలో రూ.31 లక్షలు పక్కదారి పట్టినట్లు విచారణలో తేలిందన్నారు. నెల రోజుల్లోగా రుణాలను చెల్లించేలా సీసీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో రుణాలను సీఆర్పీలు పరిశీలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వాకాడు శ్రీనిధి మేనేజర్ జయకుమార్, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

గూడూరు అర్బన్, జూన్ 10: సైదాపురం మండలం మర్లపూడిలోని జిల్లా ఉన్నత పాఠశాలకు ప్రగతి సేవా ఆధ్వర్యంలో బీరువాను వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్, జి.చంద్రశేఖర్, శ్రీనివాసులు, మురళి, రమేష్, లక్ష్మీదేవి, రాము, కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.